

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 12-06-2025 | సంపుటి - 24 | సంచిక - 41 | రూ : 4 | పేజీలు: 8





## గజం ధర... రూ.2.98 లక్షలు

- కేపీహెచ్‌బీలో స్థలాల వేలం... రూ.141 కోట్ల ఆదాయం

కేపీహెచ్‌బీకాలనీ : హైదరాబాద్ కేపీహెచ్‌బీలో బుధవారం పశ్చిమ డివిజన్ హౌసింగ్‌బోర్డు అధికారులు నిర్వహించిన వేలంలో రికార్డు ధరలు నమోదయ్యాయి. 198 గజాల నుంచి 987 గజాల విస్తీర్ణం వరకున్న 18 ఇళ్ల స్థలాలకు నిర్వహించిన వేలంలో 87 మంది పోటీదారులు పాల్గొన్నారు.

తరువాయి 2లో

# కేసీఆర్.. కిషన్‌రెడ్డి ఒక్కటే

- అందుకే తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారు
- కాళేశ్వరం నిబంధనల ప్రకారమే జరిగిందన్న ఈటల.. దాన్నే సమర్థించిన కిషన్‌రెడ్డి
- మోదీ, అమిత్‌షా మాటలకు భిన్నమైన ఈ ధోరణి దేనికి సంకేతం?
- ఆ ప్రాజెక్టుపై రెండుమూడు రోజుల్లో అన్ని విషయాలూ చెబుతా
- అధిష్ఠానంతో చర్చ మంత్రివర్గ శాఖలపై కాదు.. కర్ణాటకలో కులగణనపైనే..
- కేసీఆర్ కుటుంబానికి కాంగ్రెస్‌లోకి ప్రవేశం లేదు
- దిల్లీలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కేసీఆర్, కేటీఆర్, కిషన్‌రెడ్డిల ఆలోచన ఒకటే తీరుగా ఉందని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులను వారు అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం విషయంలో విచారణ కమిషన్ ఎదుట ఈటల ఇచ్చిన వాంగ్మూలం.. కేసీఆర్ వాదనలకు అనుగుణంగానే ఉందని, దాన్నే కిషన్‌రెడ్డి కూడా సమర్థించడంలో ఆంతర్యమేమిటని సీఎం ప్రశ్నించారు. తాను ఉన్నంతవరకు.. కేసీఆర్ కుటుంబంలో ఎవరినీ కాంగ్రెస్‌లోకి రానివ్వబోనని స్పష్టం చేశారు. దిల్లీకొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి..

తరువాయి 2లో

## 10 వేల మందికి శిక్షణ

- స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ అంగీకారం
- మంత్రి శ్రీధర్‌బాబుతో దిగ్గజ కంపెనీల ప్రతినిధుల భేటీ

**జూన్ 11, హైదరాబాద్:** ప్రపంచంలోనే తెలంగాణను నైపుణ్య రాజధానిగా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్న యూకేకు చెందిన సెమీ కండక్టర్ దిగ్గజ సంస్థ ఆర్మ్ హోల్డింగ్స్ సంస్థ ప్రతినిధులతో ఆయన బుధవారం డా.బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో భేటీ

తరువాయి 2లో





# ప్రభుత్వ ఆమోదంతోనే కాళేశ్వరం పనులు

- బ్యారేజీల్లో నీటి నిల్వ నిర్ణయం ఇంజినీర్లదే
- తుమ్మిడిహెట్టి వద్ద నీళ్లు లేకనే మేడిగడ్డకు..
- సాంకేతిక సిఫార్సులతోనే సుందిళ్ల, అన్నారం స్థలాల మార్పు
- అవేవీ రాజకీయ నిర్ణయాలు కాదు
- విచారణ కమిషన్ ఎదుట కేసీఆర్ వాంగ్మూలం
- ఆరోగ్యం బాగాలేదని బహిరంగ విచారణ వద్దన్న మాజీ సీఎం
- ఇన్ కెమెరా విచారణ నిర్వహించిన జస్టిస్ ఘోష్

**జూన్ 11, హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో ప్రతి పని కూడా ప్రభుత్వం, మంత్రివర్గం ఆమోదంతోనే చేపట్టినట్లు మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్‌కు తెలిపారు. బ్యారేజీల్లో నీటి నిల్వ నిర్ణయం ఇంజినీర్లదేనని స్పష్టం చేశారు. బ్యారేజీల నిర్మాణ ప్రాంతాలను సాంకేతిక బృందమే నిర్ణయించిందని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజి కుంగడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ నేపథ్యంలో.. వీటి నిర్మాణాలపై విచారణకు ప్రభుత్వం నియమించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట బుధవారం కేసీఆర్ హాజరయ్యారు. హైదరాబాద్ బీఆర్కే భవన్‌లోని కమిషన్ కార్యాలయానికి ఉదయం 11 గంటలకు వచ్చిన కేసీఆర్.. నేరుగా జస్టిస్ పీసీ ఘోష్ ఛాంబర్‌కు వెళ్లి ఆయనను కలిశారు. కమిషన్ బహిరంగ విచారణకు పరిమిత సంఖ్యలో మీడియా ప్రతినిధులను, కమిషన్‌లోని వివిధ విభాగాల ఇంజినీర్లను అనుమతించారు. కానీ 11.45 గంటల సమయంలో కమిషన్ కార్యదర్శి వచ్చి.. కేసీఆర్ జలుబు కారణంగా వ్యక్తిగతంగా విచారణ జరపాలని కోరారని, దీనికి కమిషన్ అంగీకరించినందున అందరూ వెళ్లిపోవాలని సూచించారు. కేసీఆర్ విజ్ఞప్తి

తరువాయి 2లో



# చంద్రబాబు మాట ఇచ్చి.. ఇల్లు కట్టించారు...

- పెనుమాకలో నిరుపేద కుటుంబంలో ఆనందం

తాడేపల్లి: సీఎం చంద్రబాబు ఓ నిరుపేద కుటుంబానికి ఇల్లు కట్టించి ఇస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాకలో సీఎం చంద్రబాబు గత ఏడాది జులై ఒకటో తేదీన 'ఎన్టీఆర్ భరోసా పింఛన్ల' పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ సందర్భంగా స్థానిక సుగాలి కాలనీలో ఉన్న బాణావత్ పాములు నాయక్, సీతమ్మ నాయక్ దంపతుల ఇంటికి వెళ్లి తొలి పింఛన్లు అందజేసి..యోగక్షేమాలను తెలుసుకున్నారు. పూరింట్లో ఉంటున్న తాము వర్షాకాలంలో తీవ్ర



తరువాయి 2లో

# సర్కారు బడుల్లో పూర్వ ప్రాథమిక విద్య

- 12 జిల్లాల్లోని 210 పాఠశాలల్లో ప్రారంభిస్తూ ఉత్తర్వులు
- ఈ విద్యా సంవత్సరం నుంచి మరో 5,651 బడుల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు
- నేడు పాఠశాలల పునఃప్రారంభం

హైదరాబాద్: వేసవి సెలవులు ముగిశాయి. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దాదాపు 50 రోజులపాటు ఆటపాటల్లో మునిగిన విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త విద్యాసంవత్సరంలో పాఠశాల విద్యాశాఖలో ఎన్నో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. తరగతికి

తరువాయి 2లో





# లాస్ ఏంజెలెస్‌లో కర్ఫ్యూ

* ఎమర్జెన్సీ ప్రకటించిన మేయర్

లాస్ ఏంజెలెస్, ఆస్టిన్: వలస సేవలు, సుంకాల అమలు విభాగం (ఐసీఈ ఐస్) చేస్తున్న అక్రమ వలసదారుల అరెస్టులకు నిరసనగా అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో మొదలైన ఆందోళనలు దేశమంతటా విస్తరించాయి. ఒకవైపు కేంద్ర బలగాల మోహరింపు.. మరోవైపు నిరసనలతో పలు నగరాలు అట్టుడుకుతున్నాయి. ఆందోళనలకు కేంద్ర స్థానంగా ఉన్న లాస్

తరువాయి 2లో

## 10 వేల మందికి శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

అయ్యారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా వివరించారు. ''సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో దిగ్గజ సంస్థగా ఉన్న ఆర్మ్ హోల్డింగ్స్.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించడం మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. తెలంగాణ రైజింగ్‌లో భాగమయ్యేందుకు ముందుకొచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. పరిశ్రమ ఏర్పాటులో అన్ని రకాలుగా అండగా ఉంటాం. మాకున్న పెద్ద ఆస్తి యువత. వారిలో ప్రతిభకు కొదువ లేదు. కొంచెం సానబెడితే మెరికల్లా తయారవుతారు. పరిశ్రమలకు అవసరమైన రెడిమేడ్ మానవ వనరులను అందించే బాధ్యతను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా మా ప్రభుత్వం తీసుకుంది. సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా తెలంగాణ యువతను తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రయాణంలో మీరు కూడా భాగస్వాములు కావాలన్నది మా ఆకాంక్ష. 10వేల మంది యువతకు శిక్షణనిచ్చే బాధ్యతను తీసుకోవాలి'' అని మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. ఈ సమావేశానికి హాజరైన మలేసియాకు చెందిన దిగ్గజ సంస్థ స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ సీఈవో కెన్ కూ మాట్లాడుతూ.. ''మా వంతుగా ఇక్కడి యువతను సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో అత్యుత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దేలా ప్రత్యేక కరిక్యులమ్ రూపొందిస్తాం. విద్యా సంస్థల సహకారంతో ఆరు నెలలు ఇక్కడ శిక్షణ.. మిగిలిన కాలం తైవాన్, దక్షిణ కొరియా, జపాన్ తదితర దేశాల్లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పిస్తాం. టీ కన్సల్ట్ సహకారంతో 2030 నాటికి 10వేల మంది యువతకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తాం'' అని తెలిపారు. ఈ సమావేశంలో టీ కన్సల్ట్ ఛైర్మన్ సందీప్‌కుమార్ మక్తాలా, వరల్డ్ తెలుగు ఐటీ కౌన్సిల్ మలేసియా విభాగం ప్రెసిడెంట్ మారుతీ, ఇతర ప్రతినిధులు మహేశ్ నటరాజ్, వాకిటి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు రాకుండా భారాస కుట్రలు: రాష్ట్రంలో పరిశ్రమలు రాకుండా భారాస కుట్రలు చేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. యువతకు ఉపాధి దొరకకుండా చేయాలన్నదే ఆ పార్టీ దుర్మార్గపు ఆలోచనగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోకి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ప్రైవేట్ సెక్టారులో లక్షన్నర ఉద్యోగాలు కల్పించామన్నారు. ఈ పెట్టుబడులన్నీ కార్యరూపం దాలిస్తే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని గులాబీ పార్టీ కలవర పడుతోందని విమర్శించారు.

## సర్కారు బడుల్లో పూర్వ ప్రాథమిక విద్య

(మొదటి పేజీ తరువాయి)

తగినట్లు అభ్యసన సామర్థ్యాలు సాధించేలా.. విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ఈసారి ముందుకు వెళ్తోంది. చిన్నారులను ప్రభుత్వ బడుల వైపు ఆకర్షించేందుకు పూర్వ ప్రాథమిక తరగతులనూ అందుబాటులోకి తెస్తోంది. కృత్రిమ మేధ సాంకేతికత ఆధారంగా పిల్లలకు చదువు నేర్పించే కార్యక్రమాన్ని అమలు చేయనుంది.

**ఈసారి ఇలా సన్నద్ధం..**

రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లోని 210 ప్రాథమిక పాఠశాలల్లో ఈసారి పూర్వ ప్రాథమిక తరగతుల (ప్రీ ప్రైమరీ)ను ప్రారంభిస్తూ విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విద్యార్థులకు సైతం ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందజేస్తారు. మధ్యాహ్న భోజనం కూడా అందిస్తారు.

* గత విద్యా సంవత్సరం చివరిలో 513 ప్రాథమిక పాఠశాలల్లో బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఏక్‌స్టెప్ ఫౌండేషన్ సహకారంతో కృత్రిమ మేధ సాంకేతికత ఆధారంగా చిన్నారులకు విద్యా బోధన చేసేందుకు కంప్యూటర్ ల్యాబ్‌లను నెలకొల్పింది. ఈసారి మరో 5,651 ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఒక్కో బడికి ఐదు కంప్యూటర్లతో ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వివిధ అంశాలపై 1.12 లక్షల మంది టీచర్లకు శిక్షణ ఇచ్చారు.
* 283 కేజీబీవీల్లో ఇంటర్ విద్య వరకు అందిస్తుండగా ఈసారి నుంచి మరో 120 కేజీబీవీల్లో ఇంటర్ అందుబాటులోకి రానుంది. దానివల్ల 7,680 సీట్లు కొత్తగా రానున్నాయి.
* అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమేటిక్స్ (స్టెమ్) విద్యను అందుకునేందుకు వీలుగా టీస్టెమ్ ల్యాబ్‌లను నెలకొల్పుతున్నారు. 610 తరగతుల విద్యార్థులు వాటి ద్వారా ఆన్‌లైన్‌లో ఆ సబ్జెక్టులను మరింత లోతుగా నేర్చుకోవచ్చు.
* రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకుల పాఠశాలల్లో 202526 విద్యాసంవత్సరానికి ఐదో తరగతిలో 51,408 సీట్లకు నిర్వహించిన ప్రవేశాలు మే నెలాఖరు నాటికే పూర్తయ్యాయి. 6, 7, 8, 9వ తరగతుల్లోని బ్యాక్‌లాగ్ ఖాళీలూ భర్తీ అయ్యాయి.

**డప్పు కొట్టి.. రారమ్మని ఆహ్వానించి**

హైదరాబాద్ కంటోన్మెంట్ తిరుమలగిరి మడ్‌ఫోర్ట్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి బుధవారం ప్రదర్శన చేపట్టారు. సిబ్బంది డప్పు కొడుతూ గురువారం నుంచి పిల్లల్ని బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు.

## గజం ధర రూ.2.98 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ వేలంతో రూ.150 కోట్లు రాబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా మొత్తం 6,236.33 గజాలకు రూ.141.36 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ స్థాయిలో ధరలు రావడం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారని హౌసింగ్ బోర్డు కమిషనర్ గౌతమ్ వెల్లడించారు. ఇవన్నీ కేపీహెచ్‌బీ హైటెక్ సిటీ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలు కావడంతో వేలంలో ఎక్కువ పలికాయి. తొలుత ఏడో ఫేజ్‌లోని నాలుగు వరుస స్థలాలకు వేలం నిర్వహించారు. అక్కడ కనీస ధర రూ.1.25 లక్షలుండగా గజానికి రూ.2 లక్షలకుపైగా ధర పలికింది. మలుపులోని ఎంఐజీ ప్లాట్‌కు అత్యధికంగా గజానికి రూ.2.52 లక్షలు వచ్చింది. తర్వాత గజానికి కనీస ధర రూ.1.50 లక్షలతో వేలం నిర్వహించిన స్థలాలకూ అదేస్థాయిలో ధరలు పలికాయి. ఇక్కడ అత్యధికంగా గజానికి రూ.2.98 లక్షలు, అత్యల్పంగా రూ.1.70 లక్షలు పలికింది. కైతలాపూర్‌లో 36.16 విస్తీర్ణంలో ఉన్న స్థలాన్ని సైతం గజం రూ.1.14 లక్షలకు పోటీదారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈఈ కిరణ్‌బాబు, ఈవో విమల, ఏఈవోలు వాసు, శ్రావణి, కార్యదర్శి రాజేశం, ఏఈఈ బిందు పాల్గొన్నారు. కేపీహెచ్‌బీ ఠాణా ఎస్‌హెచ్‌వో రాజశేఖర్‌రెడ్డి, డీఐ రవికుమార్ బందోబస్తు చేపట్టారు. వేలాన్ని అడ్డుకునేందుకు స్థానిక భాజపా నేతలు రాగా వారిని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.

## లాస్ ఏంజెలెస్‌లో కర్ఫ్యూ

(మొదటి పేజీ తరువాయి)

ఏంజెలెస్‌లో పోలీసులు కర్ఫ్యూ విధించారు. అత్యవసర పరిస్థితిని మేయర్ ప్రకటించారు. ఇక సియాటిల్ నుంచి ఆస్టిన్ దాకా, షికాగో నుంచి వాషింగ్టన్ డీసీ దాకా ఆందోళనలు జరిగాయి. పలు నగరాల్లోని వ్యాపార కూడళ్లలో, ఫెడరల్ కార్యాలయాల వద్ద ఈ ప్రదర్శనలు జరిగాయి. ఐస్‌కు వ్యతిరేకంగా ప్రజలు నినదించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. రానున్న రోజుల్లో మరిన్ని భారీ ఆందోళనలకు నిరసనకారులు పిలుపునిచ్చారు. శనివారం 'నో కింగ్స్' పేరుతో ఆందోళన నిర్వహించాలని నిర్ణయించారు. మరోవైపు సోదాలను ఆపేదిలేదని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అక్రమ వలసదారులను అరెస్టుచేసి స్వదేశాలకు తిప్పి పంపుతామని అంతర్గత భద్రతా వ్యవహారాల మంత్రి క్రిస్టీ నోయమ్ తెలిపారు. లాస్ ఏంజెలెస్‌కు సమీపంలోని శాంతా అనాలో ప్లకార్డులతో ఆందోళనకారులు నిరసన తెలిపారు. మంగళవారం రాత్రి నుంచి లాస్ ఏంజెలెస్ వ్యాపార కూడలిలో 2.5 కిలోమీటర్ల పరిధిలో పోలీసులు కర్ఫ్యూ విధించారు. గుంపును చెదరగొట్టే ప్రొజెక్టైల్స్‌ను మోహరించారు. మరోవైపు ఎమర్జెన్సీని విధిస్తూ మేయర్ కరెన్ బాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

# కేసీఆర్.. కిషన్‌రెడ్డి ఒక్కటే

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో మాట్లాడిన అనంతరం హైదరాబాద్‌కు పయనమయ్యే ముందు బుధవారం మధ్యాహ్నం తన అధికార నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. దిల్లీలో పార్టీ పెద్దలతో గత రెండు రోజులుగా జరిగిన చర్చలు తెలంగాణలో మంత్రుల శాఖల కేటాయింపుపై కాదని, కర్ణాటకలో కులగణన అంశంపై మాత్రమేనని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ కులగణన నమూనాను కర్ణాటకలోనూ అమలు చేయాలని నిర్ణయించిన అధిష్ఠానం.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లతో పాటు తనను పిలిపించి చర్చిందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగా చేరిన వారికి తన వద్ద ఉన్న శాఖలను కేటాయిస్తున్నట్లు చెప్పారు. పాత మంత్రులెవరైనా పనిభారం పెరిగిన కారణంగా తమ శాఖలను మార్చమని కోరితే తప్ప వాటి జోలికి పోమన్నారు. ఇంతవరకూ ఏ మంత్రీ ఆ విషయంపై తనను కలవలేదని స్పష్టం చేశారు.

*** కులసర్వే ఆధారంగానే మంత్రివర్గ విస్తరణ**

''ఇదివరకు కర్ణాటక ప్రభుత్వం చేసిన కులగణన తెలంగాణ మాదిరి పక్కా ఫార్మాట్‌లో లేదు. కర్ణాటక ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి దాని గురించి వివరించడానికి పార్టీ పెద్దలు నన్ను పిలిచారు. మంగళవారం ఇక్కడి పార్టీ ప్రధాన కార్యాలయంలో మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ, సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లతో సుమారు గంటన్నరపాటు దీనిపై మాట్లాడాం. తెలంగాణలో చేపట్టింది కేవలం కుల సర్వే కాదు. కుటుంబాల స్థితిగతులను 360 డిగ్రీల్లో తెలుసుకోవడానికి ప్రయత్నించాం. ఇంటింటికీ తిరిగి 60 రోజుల్లో 96.5% కుటుంబాల వివరాలను ఎన్యుమరేటర్లు సేకరించారు. 3.5% మంది ఆ సర్వేలో పాల్గొనకపోవడంతో వారికి మరోసారి అవకాశం ఇవ్వడానికి టోల్‌ఫ్రీ నంబర్లు, ఆన్‌లైన్ వ్యవస్థ, వార్డులు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు పెట్టి వివరాలు సేకరించే ప్రయత్నం చేశాం. ఈ సర్వేలో వచ్చిన వివరాల ఆధారంగానే మంత్రివర్గ విస్తరణ చేపట్టి ఎస్సీ, బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాం. కులగణన ఆధారంగా ప్రభుత్వపరమైన చర్యల గురించి మదింపు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఏర్పాటు చేశాం. ఆ కమిటీ సిఫార్సుల ప్రకారం ముందడుగు వేస్తాం.

*** శాఖల గురించి పార్టీ పెద్దలతో చర్చిస్తే తప్పేముంది?**

తాను పార్టీ పెద్దలతో మంత్రి పదవుల గురించి మాట్లాడేందుకు వచ్చి ఉంటే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి, పీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి కూడా ఉండేవారు. దానిపై చర్చలేదు కాబట్టే వారెవరూ రాలేదు. మంత్రి పదవుల కేటాయింపు అంశం ముఖ్యమంత్రి అధికార పరిధిలోనిదన్నది వాస్తవమే. ఇక్కడ నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం తప్ప రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాదు. అందువల్ల శాఖల కేటాయింపు గురించి పార్టీ పెద్దలతో చర్చించడంలో తప్పు లేదు. భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు దిల్లీ పెద్దలతో మాట్లాడకుండానే మంత్రివర్గ విస్తరణలు చేపడుతున్నారా? దిల్లీలో ఉన్న మీడియా ప్రతినిధులు మీ ప్రధాన కార్యాలయం ఉన్న హైదరాబాద్‌కు వార్తలు పంపుతున్నట్లుగానే నేను మా పార్టీ ప్రధాన కార్యాలయం ఉన్న దిల్లీకొచ్చి మాట్లాడుతున్నా. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతో మాట్లాడేందుకు నేను 500 సార్లయినా ఇక్కడికొస్తా. నా గురించి అవాకులు చవాకులు మాట్లాడుతున్న భారాస నాయకులు ఉదయం లేచిన దగ్గరి నుంచి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు ఎందుకు వెళ్తున్నారు? మంత్రుల శాఖల కేటాయింపులో కాస్త ఆలస్యమైతేనే కొందరు పనిలేని నాయకులు ఏవేవో మాట్లాడుతున్నారు. కేసీఆర్ హయాంలో ఆరునెలలపాటు మంత్రివర్గమే ఏర్పాటు కాలేదన్న విషయం వాళ్లకు గుర్తులేదా?

*** కిషన్‌రెడ్డే అతి పెద్ద సమస్య**

రాష్ట్రంలో కేసీఆర్‌కేటీఆర్‌కిషన్‌రెడ్డిల ఆలోచన ఒక్కటి కాబట్టే ఎవరూ కులగణన సర్వేలో పాల్గొనలేదు. కేసీఆర్, కేటీఆర్ ఏం చెబితే కిషన్‌రెడ్డి అది చేస్తున్నారు. భాజపా ఎంపీ ఈటల రాజేందర్ కాళేశ్వరం కమిషన్ ముందుకెళ్లి అంతా నిబంధనల ప్రకారమే జరిగిందని చెబితే కిషన్‌రెడ్డి దాన్నే సమర్థించారు. కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం ఏటీఎంలా మారిందని ఇదివరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా చెప్పిన మాటలను కూడా కాదని రాష్ట్ర భాజపా నాయకులు కాళేశ్వరాన్ని సమర్థించడం దేనికి సంకేతం? కేసీఆర్ మెట్రో విస్తరణను వ్యతిరేకిస్తే కిషన్‌రెడ్డి కూడా వ్యతిరేకిస్తున్నారు. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ప్రహ్లాద్‌జోషీలు తమ స్వరాష్ట్ర రాజధానులైన చెన్నై, బెంగళూరులకు మెట్రో ప్రాజెక్టులు తీసుకెళ్తే కిషన్‌రెడ్డి మాత్రం హైదరాబాద్‌కు మెట్రో రాకుండా అడ్డుపడుతున్నారు. రాష్ట్రం నుంచి 8 మంది భాజపా ఎంపీలున్నా ఏనాడూ ప్రధానమంత్రిని కలిసి అభివృద్ధి గురించి అడిగిన పాపాన పోలేదు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రాజెక్టుల వివరాలు ప్రధాని నాకు అందించిన వెంటనే అన్నింటినీ పరిష్కరించాను. బీబీనగర్ ఎయిమ్స్ సమస్యను కేంద్రమంత్రి నడ్డా నా దృష్టికి తీసుకొచ్చిన వెంటనే ఆగమేఘాల మీద పరిష్కరించాను. ఏ ముఖ్యమంత్రీ ఇంత వేగంగా స్పందించలేదని ఆయన నన్ను ప్రశంసించారు కూడా. కానీ కిషన్‌రెడ్డి మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర ప్రాజెక్టులపై ఆయన దిల్లీలోనో, హైదరాబాద్‌లోనో ఎందుకు సమీక్ష నిర్వహించరు? కావాలంటే నేను యంత్రాంగాన్ని తీసుకుని దిల్లీకి వస్తా. లేదా.. హైదరాబాద్ సెక్రటేరియట్‌లోనే ఏర్పాట్లు చేస్తా. ఆటోమేటిక్‌గా వచ్చే నిధులను తన ఘనతగా చెప్పుకోవడం తప్ప, కిషన్‌రెడ్డి స్వయంగా ప్రయత్నించి రాష్ట్రానికి తెచ్చిందేమీ లేదు. రాష్ట్రానికి అతిపెద్ద సమస్య కిషన్‌రెడ్డే'' అంటూ సీఎం విమర్శించారు.

*** తెలంగాణ దుష్మన్‌లను కాంగ్రెస్‌లోకి రానివ్వం**

కేసీఆర్ కుటుంబమంతా కొరివి దయ్యాలే. తెలంగాణకు తీరని ద్రోహం చేసిన ఆ కుటుంబంలో ఎవరికీ నేనుండగా కాంగ్రెస్‌లోకి ప్రవేశం ఉండదు. ఈ మాట రాసిపెట్టుకోండి. కవిత లేఖ ఒట్టి డ్రామా. వారి గురించి ప్రజలెవరూ మాట్లాడుకోవడంలేదన్న భయంతోనే లేఖ పేరుతో డ్రామా ఆడారు. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయన్న కవిత.. తన తండ్రి కాళేశ్వరం కమిషన్ ముందుకు వెళ్తుంటే, ఆ దయ్యాలతో పాటే ఆమె కూడా ఉన్నారు. చట్టబద్ధంగా ఏర్పాటు చేసిన కమిషన్లు పిలిస్తే దాన్ని కక్ష సాధింపు అని చెప్పడంలో అర్థం లేదు. కాళేశ్వరంలో జరిగిన విషయాల గురించి నేను రెండురోజుల్లో విలేకర్ల సమావేశం పెట్టి అన్ని వివరాలూ చెబుతా. ఇదేమీ కమిషన్‌ను ప్రభావితం చేయడం కిందికి రాదు. కమిషన్ స్వతంత్రంగా పనిచేస్తుంది. దానికి, ప్రభుత్వానికి సంబంధం లేదు. మా దగ్గర ఉన్న రికార్డుల ఆధారంగా మా వాదనను ప్రజలకు వినిపిస్తాం. కేసీఆర్ తన మంత్రివర్గంలో 13 మంది అగ్రవర్ణాల వారికి స్థానం కల్పించి.. 40% జనాభాకు ప్రాతినిధ్యం వహించే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కలిపి కేవలం 3 పదవులిచ్చారు. కానీ మేం ఎస్సీలకు నాలుగు మంత్రి పదవులు, ఒక స్పీకర్ పదవి కేటాయించాం. ఎస్టీలకు ఒక మంత్రి పదవి, ఒక డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చాం. రాష్ట్రంలో 29 మంత్రిత్వశాఖల్లో ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శుల పదవుల్లోనూ 80% మంది బలహీనవర్గాలకు చెందినవారే ఉన్నారు. మంత్రివర్గంతోపాటు, బ్యూరోక్రసీలోనూ సామాజిక న్యాయం అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుంది.

*** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

*** మనుషులున్నంత వరకూ నక్సలిజం ఉంటుంది**

మనుషులున్నంత రకూ సామాజిక సమస్యలుంటాయి. అవి ఉన్నంతవరకూ నక్సలిజమూ కొనసాగుతుంది. ప్రస్తుత ఎన్‌కౌంటర్లతో అది ముగిసిపోయిందనుకోవట్లేదు. పశ్చిమబెంగాల్‌లో నక్సలైట్ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసినా.. ఇందిరాగాంధీ భూసంస్కరణలు అమలు చేయడంతో దాని తీవ్రత తగ్గింది. తెలంగాణలోనూ అప్పట్లో ప్రభుత్వం 35 లక్షల ఎకరాలను ఎస్సీ, ఎస్టీలకు పంచింది. అన్ని విషయాల్లో అట్టడుగు వర్గాలకు న్యాయం చేయాలన్నదే నక్సల్‌బరీ ఉద్యమం ప్రధానోద్దేశం. ఆ ఎజెండాను కాంగ్రెస్ అమలు చేసింది. ఇప్పుడు మేం చేపట్టిన కులగణన కూడా నక్సలిజం సమస్యను తగ్గిస్తుంది. కానీ కేవలం కులాల లెక్కలు తీసి వదిలేస్తే ఫలితం ఉండదు. దాని ఆధారంగా అభివృద్ధి చేయాల్సి ఉంది.

# ప్రభుత్వ ఆమోదంతోనే కాళేశ్వరం పనులు

(మొదటి పేజీ తరువాయి)

మేరకు జస్టిస్ పీసీ ఘోష్ అప్పటికప్పుడు ఇన్‌కెమెరా విచారణకు నిర్ణయించినట్లు తెలిసింది. 12.05 గంటలకు జస్టిస్ ఘోష్ విచారణ ప్రారంభించారు. సుమారు 50 నిమిషాలు విచారణ జరగ్గా, కమిషన్ 18 ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టు మార్పునకు కారణాలు, మూడు బ్యారేజీల నిర్మాణాలకు అనుమతులు, అన్నారం, సుందిళ్ల నిర్మాణ స్థలాల్లో మార్పులు, బ్యారేజీల్లో నీటి నిల్వ చేయమన్నది ఎవరు, కార్పొరేషన్ ఏర్పాటు, రుణాల తిరిగి చెల్లింపులు తదితర ప్రశ్నలను కమిషన్ వేసినట్లు తెలిసింది. ప్రాజెక్టు రీ ఇంజినీరింగ్, తుమ్మిడిహెట్టి నుంచి మార్చాల్సి రావడం, బ్యారేజీల ఎంపిక, వాప్కోస్ అధ్యయనం, కేంద్ర జలసంఘం అనుమతులు తదితర అంశాలతో 'ది లైఫ్ లైన్ ఆఫ్ తెలంగాణ' పేరుతో ఓ నివేదికను కేసీఆర్ కమిషన్‌కు అందజేసినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జస్టిస్ పీసీ ఘోష్ అడిగిన ప్రశ్నలకు కేసీఆర్ ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

**వాప్కోస్ సర్వే.. సీడబ్ల్యూసీ నివేదికలతోనే మేడిగడ్డకు మార్పు**

కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అన్ని అనుమతులు వచ్చాయని కేసీఆర్ పేర్కొన్నారు. ''ప్రాజెక్టు కోసం కేంద్ర జల సంఘానికి సంబంధించి 11 డైరెక్టరేట్ల నుంచి అనుమతులు తీసుకున్నాం. ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించ తలపెట్టిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ వద్ద ఎగువ రాష్ట్రాల వినియోగం పోను 63 టీఎంసీల లభ్యత మాత్రమే ఉన్నట్లు సీడబ్ల్యూసీ చెప్పింది. అక్కడ 165 టీఎంసీల లభ్యత ఉన్నప్పటికీ భవిష్యత్‌లో ఎగువ రాష్ట్రాల వినియోగాన్ని మినహాయిస్తే.. తెలంగాణ సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నీళ్లు చాలని స్థితి. పైగా మహారాష్ట్రలో ఏర్పడుతున్న ముంపు, చాప్రాల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం మునక తదితర సమస్యలతో ఆ రాష్ట్రం 152 మీటర్ల వద్ద బ్యారేజీ నిర్మాణానికి ఒప్పుకోలేదు. 148 మీటర్ల వద్ద నిర్మించుకోవాలని సూచించింది. ఈ మట్టంలో అందుబాటులో ఉండేది 48 టీఎంసీలే. 16 లక్షల ఎకరాల సాగు అవసరాలు, తాగు అవసరాలకు ఈ నీళ్లు చాలవు. పైగా తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు కాలువ నిర్మాణానికి బొగ్గు బ్లాకులు అడ్డంగా ఉన్నట్లు తేలింది. దీంతో ప్రాజెక్టుల రీడిజైన్‌లో భాగంగా తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చాల్సి వచ్చింది. గోదావరిపై నీటి లభ్యత ఉండే ప్రాంతాలను అధ్యయనం చేసేందుకు అంతర్జాతీయంగా పేరొందిన వాప్కోస్ ద్వారా సర్వేకు అనుమతి ఇవ్వాలంటూ రాష్ట్రం ప్రధానమంత్రికి లేఖ రాసింది. హెలికాప్టర్ ద్వారా లైడార్ సర్వే చేపట్టేందుకు అనుమతులు ఇవ్వాలని రక్షణశాఖ మంత్రిని కూడా కోరడంతో అంగీకరించారు. కేంద్ర జలసంఘం, వాప్కోస్ సంస్థలు కలిసి సర్వే చేసి నివేదిక ఇచ్చాయి. మేడిగడ్డ వద్ద 282.30 టీఎంసీల నీటి లభ్యత ఉందంటూ 230 టీఎంసీలను ఎత్తిపోసుకునేందుకు సీడబ్ల్యూసీ అనుమతులు ఇచ్చింది. వాప్కోస్ సంస్థ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు కూడా సూచనలు చేసింది. అనంతరమే మంత్రిమండలి అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం బ్యారేజీలను చేపట్టింది'' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

# చంద్రబాబు మాట ఇచ్చి.. ఇల్లు కట్టించారు

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు పడుతున్నామని వారు సీఎం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వారి కష్టానికి చలించిన చంద్రబాబు ఇల్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే ఏడాది తిరగక ముందే రూ.12 లక్షల వ్యయంతో డాబా నిర్మించి ఇచ్చారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేయగా.. మిగిలిన నగదును విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, తెదేపా మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు సహకారంతో సమకూర్చి నిర్మాణం పూర్తి చేశారు. బుధవారం ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, కొల్లి శేషు, భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచుమర్తి ప్రసాద్ సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం పాములు నాయక్ దంపతులు పూరి గుడిసె నుంచి కొత్త ఇంట్లోకి మారారు. 'సీఎం స్వయంగా మా కష్టం తెలుసుకుని ఇంటిని నిర్మించి ఇచ్చారు. ఆయనకు, మంత్రి లోకేశ్‌కు రుణపడి ఉంటాం' అని పాములు



# కాళేశ్వరం ప్రాజెక్ట్ అనే గుదిబండను తెలంగాణపై మోపిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం

* **కెసిఆర్ విచారణ కమిషన్ ముందు హాజరయ్యేందుకు ఎందుకు జంకుతున్నారు.**
* **కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ అనే గుదిబండను తెలంగాణపై మోపిందని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి అన్నారు. బుధవారం ముస్తాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ చేసింది తానేనని గొప్పలు చెప్పుకున్న మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడు ఎందుకు మాట మారుస్తున్నారని ప్రశ్నించారు. ప్రాజెక్టుతో ఒక్క ఎకరా కూడా గోదావరి నీరు పారకుండా లక్షలాది ఎకరాల్లో పంటలు పండయని గొప్పలు చెప్తోందన్నారు. తన మేధస్సుతో ప్రాజెక్టును కట్టానని చెప్పుకున్నా కెసిఆర్ విచారణ కమిషన్ ముందు హాజరయ్యేందుకు ఎందుకు జంకుతున్నాడని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు కాళేశ్వరం ప్రాజెక్టుపై నిజాలు చెప్పాలని, తప్పును ఒప్పుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పేదలకు సన్న బియ్యం, రైతులకు ఉచిత విద్యుత్, రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత సిఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని, ఇప్పుడు ఏడాది కాలంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. భూమి సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం ద్వారా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కలకొండ కిషన్ రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్ రావు, వేణు,శ్రీకాంతు, అంజిరెడ్డి, పుట్ట చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గులాబీ దళపతికి మద్దతుగా కుత్బుల్లాపూర్ నుంచి భారీగా తరలివెళ్ళిన బిఆర్ఎస్ శ్రేణులు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పై కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన జస్టిస్ పీసీ గోష్ కమీషన్ విచారణకు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరు కానున్న నేపథ్యంలో గులాబీ దళపతి మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో బిఆర్కే భవన్ కు తరలివెళ్ళారు. న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి బిఆర్కే భవన్ వరకు భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ కు చెందిన పలువురు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మ మాట అంగన్ వాడి బాట..



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : స్థానిక హరిజన వాడ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అమ్మ మాట అంగన్వాడి బాట అనే కార్యక్రమాన్ని సిడిపిఓ అరుణకుమారి ప్రారంభించారు ఈ మేరకు ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలలో తమ పిల్లల పేర్లు నమోదు చేయించుకుని వారి భవితకు పునాదులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రోహిణి అంగన్వాడీ టీచర్ సుధారాణి , తదితరులు పాల్గొన్నారు.

## జవాబుదారీతనంతో పనిచేస్తాం

**: రాజు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు జవాబుదారీతనంతో పనిచేస్తారని, పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకుంటారని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాజు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్. ప్రభుదయాళ్ ఆధ్వర్యంలో బుధవారం 2 ఇంక్లైన, 3 ఇంక్లైన్, 7 నెంబర్ బజార్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ పాఠశాల విశిష్టతలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చితే వారికి పుస్తకాలు, బ్యాగులు, దుస్తులు ఉచితంగా అందించడమే కాకుండా ప్రతిరోజు మధ్యాహ్న భోజనం రుచికరమైన భోజనం అందిస్తామన్నారు. తల్లిదండ్రులుగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రతిరోజు వారిని పాఠశాలకు పంపిస్తే పిల్లలకు చదువుతోపాటు ఇతర విషయాలైన పెద్దలను గౌరవించడం, సమాజంలో నడుచుకునే విధానం తదితర అంశాల గురించి కూడా వివరిస్తామన్నారు. ప్రతీ విద్యార్థి 80 శాతం అటెండెన్స్ ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదిగే విధంగా పాఠశాల స్థాయిలో మంచి పునాది వేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వై. మధుసూదన్‌రావు, మిట్టు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి

* **అనధికారిక పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలి**
* **బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి ఈడుగురాల సురేష్ గౌడ్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి ఈడుగురాల సురేష్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిగురు వెంకన్న, పాకాల శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభంతో విద్యార్థులు పాఠశాలల్లో చేరుతున్నారని, పిల్లల్ని ప్రైవేటు స్కూల్స్‌కు పంపేందుకు పేరెంట్స్ ఇష్టపడుతున్నారని, వారి నమ్మకాన్ని అవకాశంగా మలుచుకుంటున్న ప్రైవేట్ పాఠశాలలు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఉందని అన్నారు. పోటీపరీక్షల్లో నెగ్గుకురావాలంటే ప్రైవేట్ స్కూళ్లలో చదవాలన్న భావన వల్ల తల్లిదండ్రులు ప్రైవేట్ చదువులపై మొగ్గుచూపుతున్నారని, దీంతో తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి పనిచేసిన డబ్బంతా పిల్లల ఫీజుల కోసం ఖర్చు చేస్తున్నారని, ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రుల నుండి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. పేరెంట్స్ నమ్మకాన్ని అవి అవకాశంగా మలుచుకుంటున్నాయని, ఈ పరిస్థితుల్లో ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలనీ డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా నడుస్తున్న పుట్టగొడుగుల్లా వెలిసిన అనధికార పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యను వ్యాపారంగా మార్చుకున్న పాఠశాలపై చర్యలు తీసుకుని, విద్యా విలువలు నిలబెట్టాలని, తెలంగాణలో పాఠశాలల్లో ఫీజుల నిర్ణయం ఎలా జరుగుతోందని, రాష్ట్రంలో ఫీజుల నియంత్రణపై వేసిన గత కమిటీలు ఏం చెప్పాయని, బడుల్లో ఫీజులపై విద్యాహక్కు చట్టం ఏం చెబుతోందని ప్రశ్నిస్తూ మండిపడ్డారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి మహిపాల్, కుంట శ్రీను, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అమాయక ఆదివాసీలపై యుద్ధం ప్రకటించిన మోడీ,అమిత్ షా

* **రాజ్యాంగాన్ని ఉల్లంగిస్తున్న కేంద్రం చర్యలని ఎండగట్టాలి**
* **వామపక్ష, విపక్షాల సదస్సులో నేతలు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మధ్యభారతంలోని అమాయక ఆదివాసీ గిరిజనులపై ప్రధాని మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా యుద్ధం ప్రకటించి హత్యాకాండకు పాల్పడుతోందని, ఈ చర్యలను దేశ ప్రజలు ముక్తకంఠంతో కండించాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, న్యూ డిమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సీపీఎం జిల్లా నాయకులు రేపాకుల శ్రీనివాస్,టిజెఎస్ జిల్లా నాయకులు మల్లెల రామనాధం, మాస్ లైన్ జిల్లా నాయకులు జాటోత్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు గౌస్ పాషా, బిఆర్ఎస్ జిల్లా నాయకులు అనుదీప్, బిఎస్పి జిల్లా నాయకులు కురుమళ్ల శంకర్, టిపిఎఫ్ జిల్లా నాయకులు ప్రశాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం 'శేషగిరిభవన్'లో జరిగిన వామపక్ష, విపక్షాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో నాయకులు మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని, ఆదివాసీ చట్టాలను కేంద్రప్రభుత్వం ఉల్లంగించి 'ఆపరేషన్ కగార్'పేరుతో దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందని, అమాయక ఆదివాసీ బిడ్డలను పొట్టనపెట్టుకుంటోందని రోపించారు. దేశ రక్షణకోసం సరిహద్దుల్లో ఉంచాల్సిన సైనికులను ప్రజలకోసం పోరాడుతున్న మావోఇస్టులపైకి ఉసిగొల్పుతూ హత్యలకు ప్రేరేపిస్తోదని విమర్శించారు. 2026 నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని అమిత్ షా ప్రకటించడాన్ని దేశ ప్రజలు కోరుకోవడం లేదని, పేదరిక నిర్మూలన, పూర్తి స్థాయిలో విద్య, వైద్యం, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని బాధ్యతగా కేంద్ర పాలకులు ప్రకటిస్తే ప్రజలు స్వాగతిస్తారని అన్నారు. అటవీ ప్రాంతంలో ఖనిజ సంపదకు కాపలాదారులుగా ఉన్న గిరిజనులను, మావోయిస్టులను మట్టిబెట్టి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే 'ఆపరేషన్ కగార్'కు కేంద్రం తెరలేపిందని ఆరోపించారు. తక్షణమే 'ఆపరేషన్ కగార్' పేరుతో జరుపుతున్న హత్యాకాండకు స్వస్తి చెప్పి శాంతి చర్చలను కేంద్రం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. గౌని నాగేశ్వరరావు, కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, భూక్యా శ్రీనివాస్, కె రత్నకుమారి, ఫహీమ్, కె ఉమర్, కల్తీ వెంకటేశ్వర్లు, సతీష్, గోపాల్ రావు, దేవదానం, భూక్యా రమేష్, కృష్ణయ్య, సంజీవ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## దైనందిత జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలి

* **యోగా ఇన్‌స్ట్రక్టర్ కొచ్చర్ల కమలారాణి**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో బుధవారం క్రీడాకారులు, వాకింగ్ చేసేవారికి, పిల్లలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు యోగా ఇన్‌స్ట్రక్టర్ కొచ్చర్ల కమలారాణి మాట్లాడుతూ గత నెల 23వ తేదీ నుండి ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో యోగాపై ప్రచారం నిర్వహిస్తున్నామని అన్నారు. యోగా అంటే ఏమిటి, యోగా వల్ల కలిగే లాభాల గురించి కమలారాణి వివరిస్తూ కొన్నిరకాల వ్యాధులు మన దరి చేరకుండా ఇమ్యూనిటీ బూస్టర్‌లా యోగా పనిచేస్తుంది. యోగాను దైనందిత జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయుష్ విభాగం మేల్ ఇన్‌స్ట్రక్టర్ రమేష్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని పబ్లిక్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, యోగా సర్వ రోగ నివారిణిగా పనిచేస్తుందిని అన్నారు. సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, యోగా ద్వారా ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడుతుంది. అనంతరం పలు యోగాసనాలను ప్రదర్శించారు.

## పేదల ఆరోగ్య రక్ష సీఎం సహాయనిధి

* **రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : పేదల ఆరోగ్య రక్ష సీఎం సహాయనిధి అని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ అన్నారు. చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 127 రంగారెడ్డి నగర్ డివిజన్ పంచశీల కాలనీ ప్రాంతానికి చెందిన మధుస్మిత జెన (25) ఆరోగ్య పరిస్థితి బాగాలేదని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ వైద్య సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారులు మధుస్మిత జెన కు రూ.1.40 లక్షలను మంజూరు చేయించగా బుధవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితులకు కార్పొరేటర్ విజయశేఖర్ గౌడ్ చేతులమీదుగా బాధిత కుటుంబసభ్యులకు ఎల్వోసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూసేవారు ముఖ్యమంత్రి సహాయనిధిని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్తీక్ గౌడ్, తేజ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హోటల్ నక్షత్ర ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మల్లాపూర్ డివిజన్ పరిధి లో ని గ్రీన్ హిల్స్ కాలనీ నందు నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్ నక్షత్ర ప్రారంభోత్సవంనకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

* **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ జి. నరేందర్,భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్,భద్రాచలం ఇన్స్పెక్టర్ నాగరాజు,ఎస్సైలు స్వప్న,రామకృష్ణ,శ్యామ్ ప్రసాద్ , సిబ్బంది పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు కనీస సౌకర్యాలను అందించటమే మా లక్ష్యం

**: ఎస్పీ రోహిత్ రాజు**





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి కనీస సౌకర్యాలను అందజేయటమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.బుధవారం చర్ల మండలంలోని మావోయిస్టు ప్రభావిత సరిహద్దు గ్రామాలైన 20 గ్రామాలకు మినీ రైస్ మిల్లులను అందజేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు.రాళ్లపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్,భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్ లు కూడా పాల్గొన్నారు.సుమారుగా 50 లక్షల రూపాయల వ్యయంతో 20 గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మినీ రైస్ మిల్లులను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.మినీ రైస్ మిల్లు కొరకు ఏర్పాటు చేసిన షెడ్డుతో కలిపి ఒక్కో యూనిట్ విలువ 2,50,000/రూపాయల ఖర్చుతో 20 గ్రామాలలో 20 యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేశారు.రాళ్లపురం గ్రామంలో చర్ల పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ నిషేధిత మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజలకు విద్య,వైద్యం,రవాణా వంటి కనీస సౌకర్యాలతో పాటు మౌళిక సదుపాయాలను కూడా అందించటమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని అన్నారు. తమ తమ గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసు వారి దృష్టికి తీసుకురావాలని,అట్టి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి కృషి చేస్తామని తెలిపారు.ఏజెన్సీ గ్రామాలలోని యువత అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. రాళ్లపురం గ్రామం నుండి జాతీయ స్థాయిలో సెయిలింగ్ క్రీడలో పాల్గొన్న ఆడమయ్యను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. అనంతరం అడమయ్యను ఎస్పీ గ్రామస్తుల సమక్షంలో ఘనంగా సన్మానించారు.నిషేధిత మావోయిస్టు పార్టీ నాయకులు తమ ఉనికిని చాటుకోవడానికే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని,అలాంటి అసాంఘిక శక్తులకు ఎవరూ సహకరించకూడదని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం తరపున పోలీసు శాఖ ఆదివాసి ప్రజలకు అందిస్తున్న అభివృద్ధిని,లొంగిపోయిన మావోయిస్టులకు కల్పిస్తున్న పునరావాస సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని మావోయిస్టు పార్టీలో పనిచేసే సభ్యులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. రాళ్లపురం గ్రామం నుండి నిషేధిత మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న పొడియం లక్ష్మి కుటుంబాన్ని సందర్శించి,ఆమె కుటుంబ సభ్యులకు దుస్తులను అందజేశారు.ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన మినీ రైస్ మిల్లును ప్రారంభించి,అట్టి మిషన్ పని చేసే విధానాన్ని ఎస్పీ పరిశీలించారు.ఈ సమావేశంలో పాల్గొన్న గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చర్ల మండల పరిధిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజు వర్మ,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఎస్సైలు నర్సిరెడ్డి,కేశవ , సిబ్బంది పాల్గొన్నారు.

## టీపీసీసీ నూతన ఉపాధ్యక్షునికి ఉప్పల్ ప్రజాప్రతినిధుల అభినందనలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : టీపీసీసీ ఉపాధ్యక్షులుగా నియమితులైన బొంతు రామ్మోహన్ ని ఉప్పల్ నియోజకవర్గ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి ,రామంతపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తవిడబోయిన గిరిబాబు , జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, ప్రకాష్, నరసింహ, సాయి నితీష్, రాజేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ,ఉప్పల్ ఏ బ్లాక్ జనరల్ సెక్రెటరీ సుర్వి మురళి గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బౌరంపేట కృష్ణ , మాజీ నేషనల్ యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ వినోద్ ముదిరాజ్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశ్వకర్మ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పబ్బోజు బిక్షపతి చారి తదితరులు పాల్గొన్నారు

## రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు పాఠశాలల్లో 50 శాతం రాయితీ

*** ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు**



రంగారెడ్డి, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు పూర్తి రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే జిల్లా శాఖ తరుపున చేసిన వినతికి స్పందించిన డిఈఓ 50 శాతం రాయితీ ఇవ్వాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రయివేటు పాఠశాలలో పిల్లల చదువులకు ఫీజులు భారంగా మారాయని జిల్లా కలెక్టర్ తో పాటు డిఈఓ దృష్టికి యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా నేతృత్వంలోని బృందం తీసుకెళ్లటంతో ఈ మేరకు ఆయన ఉత్తర్వులు ఇచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కి జిల్లా శాఖ తరుపున ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా కలెక్టర్ నారాయణరెడ్డి కి,డి ఈ ఓ సుశీందర్ రావు లకు జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషా, కార్యదర్శి సత్యనారాయణలు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆదేశాలు జిల్లాలోని అన్ని పాఠశాలలకు వర్తించేలా చూడాలని వారు కోరారు.

## వరంగల్ లో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా అవగాహన సదస్సు



శేర్లింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : చట్టాలపై అవగాహణ కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. వరంగల్ జిల్లాలో తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రఘు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేఘ లీగల్ ఆధ్వర్యంలో సెమినార్ చేపట్టారు. ప్రతి ఒక్కరికి మహిళా హక్కులు ఆర్టిఐ యాక్టు చట్టాలపై అవగాహణ అవసరమని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నేషనల్ ప్రెసిడెంట్ ఫౌండర్ అయ్యప్ప అడ్వకేట్ ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ మోమిన్ భాష, తెలంగాణ స్టేట్ చైర్మన్ నాగమణి, తెలంగాణ స్టేట్ డైరెక్టర్ ఉదయ శంకర్ ,తెలంగాణ స్టేట్ చీఫ్ చైర్మన్ నరేష్ , శ్రీనివాస్ గౌడ్, సుధా నాయుడు దుర్గా రెడ్డి,, చంద్రమౌళి లక్ష్మణ్ ఏ రమేష్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములలో స్లమ్స్ ను గుర్తించి నివేదికలు సమర్పించాలి

*** జిల్లా అదనపు కలెక్టరు రాధికాగుప్తా**





మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) :ప్రభుత్వ భూములలో ఉంటున్న నిరుపేదలకు పక్కా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు గాను ప్రభుత్వ భూములలో స్లమ్స్ ను గుర్తించి నివేదికలు సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టరు రాధికాగుప్తా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి అదనపు కలెక్టరు హాజరై మాట్లాడుతూ తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములలో ఉన్న మురికివాడలలో ఉన్న ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద వాటిని తిరిగి నిర్మించేందుకుగాను స్థలాలను గుర్తించేందుకు తహసీల్దార్లను, మున్సిపల్ కమీషనర్లు సమన్వయంతో పనిచేసి నివేదిక సమర్పించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద శిథిలావస్థలో, ఇరుకుగా ఉన్న ఇళ్లును పునరాభివృద్ధి చేసేందుకు గాను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ప్రతి మున్సిపాలిటిలలో వార్డులలో ఉన్నస్లమ్ ఏరియాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములలో మురికివాడలలో ఉన్న ఇళ్లను గుర్తించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆ కుటుంబాల సమ్మతితో నివేదికలు తయారు చేసి ఈ నెల 13వ తేదిలోగా నివేదికలు అందించాలని తెలిపారు. సర్వేలో, ప్రజలను ఒప్పించడంలో స్థానిక నాయకులను భాగస్వాములను చేయాలన్నారు. భవిష్యత్తులో అన్ని మురికివాడల నివాసితులకు అన్ని సౌకర్యాలతో పాటు గౌరవప్రదమైన గృహాలను అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్ హౌజింగ్ ఈఈ రమణమూర్తి, తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు,తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

*** డీఈవో విజయ కుమారికి వినతి**



ప్రజాస్ఫూర్తి, మేడ్చల్ : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని విద్యాశాఖ అధికారి విజయ కుమారి కి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితి అందరికీ తెలుసు. పత్రిక రంగాన్ని నమ్ముకుని పని చేస్తున్న జర్నలిస్టులు ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నారు. కాబట్టి జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో వీలైనంత ఎక్కువగా రాయితీ ఇప్పించవలసిందిగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యుజేఎఫ్ ) కోరుతున్నది. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం కూడా మీరు మా జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలకు ఈ విషయమై ఆదేశాలు ఇవ్వవలసిందిగా కోరారు.ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి సానుకూలంగా స్పందించారు. వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి హరిప్రసాద్, జిల్లా కోశాధికారి బెలిదే అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు జి రోజా రాణి, నాయకులు గడ్డమీద అశోక్, పిట్ల శంకర్, ఏ. గోవిందరావు, సంజీవ్ కుమార్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని కులలాను సమానంగా చూస్తారు

*** శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని కులలాను సమానంగా చూస్తారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశంతో బీసీ కమిషన్ పిలుపుమేరకు తెలంగాణలో బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాల బాధితులమైన శెట్టిబలిజ సామాజిక వర్గం సభ్యులు వారి యొక్క గోడు బిసి కమిషన్ కు వినిపించుటకు వైఎఫ్సీఎ, టీఎస్డబ్ల్యూఎ, వైఎఫ్సీఎ, రక్షణ సమితి ఆధ్వర్యంలో వివిధ ఏరియా సంఘాల సారథ్యంలో ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషాముళ్లపూడి రోడ్డులో గల భవ్యాస్ తులసి వనం నుండి అధిక సంఖ్యలో బీసీ కమిషన్ ఆఫీస్ కు వెళ్లే ర్యాలీ ని కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, రావుల శేషగిరిరావు ల తో కలిసి ఎమ్మెల్యే గాంధీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా శెట్టి బలిజ కులస్తులు మాట్లాడుతూ మేము తొలగించిన 26+1 కులాలకు చెందిన వారము గత 11 ఏళ్లగా మమ్మల్ని పట్టించుకున్న నా దుడే కరువైన తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీసీ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలగించిన కులాల వారు తమ వద్దకు వచ్చి ఎదురు అవుతుంది ఇబ్బందులు ఇక్కట్లను తెలియజేయాల్సిందిగా కోరుతుంది. సదరు బీసీ కమిషన్ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శెట్టిబలిజ కులస్తులము తరలి వెళ్తున్నాము అని అధిక సంఖ్యలో వెళ్లడానికి వివిధ ఏరియా సంఘాలు తరలి వెళుతున్నాం అని శెట్టిబలిజ కులస్తులు తెలియచేసారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుంది అని, తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తారని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో శెట్టి బలిజ కులస్తులు నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆధారాలు లేని అభియోగాలు మోపొద్దు

**: సింగర్ మంగ్లీ**



హైదరాబాద్: సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి లభ్యమయ్యాయని పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తనకు తెలిసి ఎలాంటి తప్పు చేయలేదని వివరణ ఇస్తూ బుధవారం రాత్రి మంగ్లీ వీడియో విడుదల చేశారు. ''నా బర్త్ డే పార్టీ ఫ్యామిలీ ఫంక్షన్ మాదిరిగా జరుపుకోవాలనే ఉద్దేశంతో మా అమ్మానాన్నల కోరిక మేరకు కుటుంబ సభ్యులు, బంధువులతో ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడ మా కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు కూడా ఉన్నారు. లిక్కర్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. లిక్కర్‌కు, సౌండ్ సిస్టమ్‌కు అనుమతి తీసుకోవాలనే విషయంపై నాకు అస్సలు అవగాహన లేదు. రిసార్ట్‌లో పార్టీ అనుకోకుండా.. సడన్‌గా ప్లాన్ చేసుకోవడం జరిగింది. నాకు తెలిసి ఉంటే తప్పకుండా అనుమతి తీసుకునే దాన్ని. అనుమతి తీసుకోవాలనే విషయం నాకు ఎవరూ చెప్పలేదు. తెలిసి అయితే.. నేను ఎలాంటి తప్పు చేయలేదు. రిసార్ట్‌లో లోకల్ లిక్కర్ తప్ప ఎలాంటి ఇతర మత్తు పదార్థాలు అక్కడ లేవు.. వాడలేదు. పోలీసులు సెర్చ్ చేసినా ఎలాంటి మత్తు పదార్థాలు దొరకలేదు. గంజాయి తాగినట్టు ఎవరికైతే పాజిటివ్ వచ్చిందో ఆ వ్యక్తి వేరే ఎక్కడో .. ఎప్పుడో తీసుకున్నట్టు తేలిందని పోలీసులే చెప్పారు. దానిపై విచారణ కూడా జరుగుతోంది. మేం కూడా పోలీసులకు సహకరిస్తున్నాం. నాకు తెలిసి ఎందుకు ఇలా చేస్తాను. మా అమ్మా, నాన్నలను దగ్గర పెట్టుకొని ఇలాంటివి ప్రోత్సహిస్తానా? ఒక రోల్ మోడల్‌గా ఉండాలనుకుంటాను కానీ, ఇలాంటివి ఎందుకు చేస్తాను. మీడియా మిత్రులకు నా విన్నపం.. దయచేసి ఆధారాలు లేని అభియోగాలు నాపై మోపొద్దు.. ప్లీజ్'' అంటూ మంగ్లీ వీడియో విడుదల చేశారు.

## అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు.. జర్నలిస్టు కృష్ణంరాజు అరెస్ట్



విశాఖ: 'అమరావతి దేవతల రాజధాని కాదు.. వేశ్యల రాజధాని' అంటూ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా, తీవ్ర అవమానాలకు గురిచేసేలా సాక్షి టీవీ ఛానల్‌లో అత్యంత దారుణమైన వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న అతన్ని బుధవారం రాత్రి భీమిలి గోస్తనీనది సమీపంలో సెల్ టవర్ లోకేషన్ ఆధారంగా పోలీసులు అరెస్ట్ చేశారు. కృష్ణంరాజు వెంట ఉన్న మరో ఇద్దరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తుళ్లూరు పోలీసులు ముగ్గురినీ విశాఖ నుంచి గుంటూరుకు తీసుకొస్తున్నట్టు సమాచారం. గురువారం మంగళగిరి కోర్టులో హాజరు పరిచే అవకాశం ఉంది. అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్ట్ మ్యాగజైన్ ఎడిటర్ వీవీఆర్ కృష్ణంరాజు, సాక్షి టీవీ వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావుపై గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేయగా.. మంగళగిరి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

## తిరుమలలో ముగిసిన జ్యేష్ఠాభిషేకం



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు వైభవంగా జరిగిన జ్యేష్ఠాభిషేకం ముగిసింది. చివరి రోజైన బుధవారం ఉభయ దేవేరులతో కలిసి శ్రీమలయప్పస్వామివారు బంగారు కవచంలో దర్శనమిచ్చారు.ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం నిర్వహించే వరకు ఏడాది పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచం తోనే ఉంటారు.

## కళ్లు చెదిరే విల్లాలు, ఓపెన్ ప్లాట్లు..

# రూ.కోట్లలో అక్రమాస్తులు కూడబెట్టిన శ్రీధర్

హైదరాబాద్: నీటిపారుదల శాఖ ఈఈ నూనె శ్రీధర్ నివాసం, కార్యాలయం, అతని బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు జరిపిన సోదాల్లో భారీగా ఆస్తులు గుర్తించారు. తెల్లాపూర్‌లో విల్లా, షేక్‌పేటలో ఫ్లాట్, కరీంనగర్‌లో 3 ఓపెన్ ప్లాట్లు, అమీర్‌పేటలో వాణిజ్య భవనం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లో 3 ఇండిపెండెంట్ హౌస్‌లు, అతనికి సంబంధించి 16 ఎకరాల వ్యవసాయ భూమి గుర్తించారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లో 19 ఓపెన్ ప్లాట్‌లు ఉన్నట్టు తేలింది. బహిరంగ మార్కెట్‌లో ఈ ఆస్తుల విలువ రూ.వందల కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంకులో భారీగా నగదు నిల్వలు తనిఖీల్లో బయటపడ్డాయి. శ్రీధర్ తన పదవిని అడ్డం పెట్టుకొని భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టు ఏసీబీ నిర్ధరించింది. దీంతో నూనె శ్రీధర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల



కేసు నమోదు చేసిన అధికారులు అతన్ని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పర్చారు. మరికొన్ని ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాల్సి ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు. శ్రీధర్ ఎస్‌ఆర్‌ఎస్పీ డివిజన్ 8లో ఈఈగా పని చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 6, 7, 8 ప్యాకేజీల పనులను పర్యవేక్షించారు. ప్రస్తుతం ఇరిగేషన్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

## ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు



హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) తరగతుల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి చదువుకునే అవకాశం ఉండగా... ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నడుస్తున్నాయి. పిల్లలకు మూడేళ్లు నిండగానే తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని, దానివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని భావిస్తున్న ప్రభుత్వం.. శిశు విద్యను ప్రారంభించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 210 పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. 2025..26 విద్యా సంవత్సరానికి నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల్లో విద్యార్థులను చేర్చుకోవాలని డీఈవోలకు సూచించింది.

## ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారు : మంత్రి పొంగులేటి

ములుగు: గత భారాస ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, ధరణి, మిషన్ భగీరథ పథకాలు పెద్ద స్కామ్ అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ములుగులో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారని ధ్వజమెత్తారు. జాతిపితగా ప్రకటించుకునే వ్యక్తి దర్యాప్తు సంస్థ ముందు విచారణకు వచ్చారని,



ఎంతటి వారైనా తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### గ్రూప్1 నియామకాలపై

## స్టే ఎత్తివేయాలని హైకోర్టులో 4 పిటిషన్లు



హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్ 1 నియామకాలపై స్టే ఎత్తివేయాలని కోరుతూ హైకోర్టులో నాలుగు పిటిషన్లు దాఖలయ్యాయి. గ్రూప్1 మెయిన్స్ పరీక్షా కేంద్రాల కేటాయింపు, మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పలువురు అభ్యర్థులు గతంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. గత నెలలోనే ఈ పిటిషన్లపై వాదనలు జరిగాయి. పునర్‌మూల్యాంకనం చేయాలని లేదా మరోసారి మెయిన్స్ నిర్వహించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరారు. అభ్యర్థులు కేవలం అపోహపడుతున్నారని, నిపుణులతో మెయిన్స్ పత్రాల మూల్యాంకనం చేయించామని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గ్రూప్ 1 నియామకాలు ఆలస్యమైతే ఎంపికైన అభ్యర్థులు నష్టపోతారని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయస్థానం గ్రూప్ 1 నియామకాలపై స్టే విధించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చని ఆదేశించింది. గ్రూప్ 1 నియామకాలపై విధించిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ గ్రూప్ 1కు ఎంపికైన నలుగురు అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానంలో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రోజు విచారణ సందర్భంగా స్టే వెకెట్ పిటిషన్లపై వాదనలు జరిగాయి. కౌంటరు దాఖలు చేయడానికి టీజీపీఎస్సీ, ఇతర న్యాయవాదులు సమయం కోరారు. విచారణను ఆలస్యం చేయొద్దని, దీని వల్ల ఎంపికైన అభ్యర్థులకు ఇబ్బందులు ఉంటాయని హైకోర్టు తెలిపింది. వినిపించిన వాదనలే మళ్లీ వినిపించొద్దని, ఈనెల 30న పూర్తి స్థాయి వాదనలు వింటామని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## పరిశ్రమల ఏర్పాటును భారాస అడ్డుకుంటోంది

**: మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్: తెలంగాణలో పరిశ్రమలు ఏర్పాటు కాకుండా భారాస కుట్రలు చేస్తోందని పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు దొరక్కుండా చేయాలన్నదే వారి దుర్మార్గపు ఆలోచన అని మండిపడ్డారు. ''ఏడాదిన్నరలో రాష్ట్రానికి రూ.3లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రైవేటు రంగంలో లక్షన్నర ఉద్యోగాలు కల్పించాం. పరోక్షంగా మరో లక్ష మంది ప్రయోజనం పొందుతున్నారు. పెట్టుబడులన్నీ కార్యరూపం దాలిస్తే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని భారాస



కలవరపడుతోంది. పరిశ్రమల ఏర్పాటుకు ఆటంకాలు సృష్టిస్తూ భారాస నేతలు రైతులను రెచ్చగొడుతున్నారు. అరాచకం సృష్టించాలని చూస్తే ప్రభుత్వ యంత్రాంగం చూస్తూ ఊరుకోదు. 2025-26 నాటికి పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ కలపాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. జోగులాంబ గద్వాల్ జిల్లా పెద్ద ధన్వాడలో కేంద్రం నిర్ణయం మేరకే ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటవుతోంది. భూములను పరిశ్రమ యాజమాన్యమే కొనుగోలు చేసింది. నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభమైతే యువతకు ఉద్యోగాలు వచ్చి ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. భారాస మాత్రం రాజకీయ ఎజెండాతో ఫ్యాక్టరీ ఏర్పాటును అడ్డుకుంటోంది. గత ఓటమి నుంచి భారాస గుణపాఠం నేర్చుకుని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలి'' అని శ్రీధర్‌బాబు అన్నారు.

## రక్షణశాఖ సహకారంతో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు

**: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

హైదరాబాద్: శ్రీశైలం ఎడమ కాలువ సొరంగం పనుల పునరుద్ధరణకు సిద్ధమవుతున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మిగిలిన 9కి.మీ సొరంగం పనులు వచ్చే రెండేళ్లలో పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఇవాళ రక్షణ మంత్రిత్వ శాఖతో జరిగిన భేటీలో ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ నుంచి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేయడానికి సహకారం కావాలని కోరగా.. అంగీకరించినట్టు చెప్పారు. శ్రీశైలం పులుల సంరక్షణ కేంద్రంగా ఉన్నందున హెలికాప్టర్ సర్వే చేసి.. తదుపరి పనులు మొదలు పెట్టాలని చూస్తున్నామన్నారు. ఆర్మీలో ఉన్న కల్నల్ పరీక్షిత్ మెహరా, సరిహద్దు రోడ్డు సంస్థమాజీ డీజీ జనరల్ హర్పాల్ సింగ్‌ను డిప్యూటేషన్‌పై తెలంగాణకు పంపేందుకు కేంద్రం అంగీకరించిందన్నారు. పరీక్షిత్ మెహరాను ప్రత్యేక కార్యదర్శిగా, జనరల్ హర్పాల్‌సింగ్‌ని గౌరవ సలహాదారుగా తీసుకుంటున్నామని తెలిపారు. వీరిద్దరి సహకారంతో రాష్ట్రంలో చేపట్టిన అన్ని సొరంగాల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. డెన్మార్క్ నుంచి అత్యాధునిక ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పరికరాలు తీసుకొస్తున్నామని వివరించారు. వీటి ద్వారా 44 కి.మీ మొత్తం సొరంగం భూమిపై నుంచే.. భూమి లోపల కిలోమీటరు వరకు పరిస్థితి తెలుసుకుని తదుపరి చర్యలకు ఉపకరిస్తుందన్నారు. ఈ సర్వే ద్వారా సొరంగం వాస్తవ పరిస్థితి అంచనా వేయొచ్చన్నారు. హెలికాప్టర్‌కు లైడార్ కూడా ఏర్పాటు చేసి సర్వే చేస్తామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి వివరించారు. వైమానిక దళ హెలికాప్టర్లు, పవన్ హన్స్ హెలికాప్టర్ల సాయం కూడా అడిగామన్నారు. ఎన్‌జీఆర్‌ఐ నిపుణులు ప్రొఫెసర్ తివారీ, ధన్‌బాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ సహకారం కూడా తీసుకుంటామన్నారు. జులై 12



నుంచి సర్వే ప్రారంభమవుతుందని, వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ''44 కి.మీ ఎస్ఎల్‌బీసీ సొరంగం మధ్యలో గాలికూడా చొరబాటుకు అవకాశం లేకుండా నిర్మాణం చేపట్టారు. ఇరుక్కు పోయిన టీబీఎం తీయడానికి సాధ్యం కాదు కాబట్టీ .. పక్క నుంచి సొరంగం తవ్వకం చేపడతాం. సీతారామ, దేవాదుల ఇంకా పెండింగ్‌లో ఉన్న అన్ని టన్నెల్ ప్రాజెక్టులకు కొత్త టెక్నాలజీ ఉపయోగించి పూర్తి చేస్తాం'' అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## కాళేశ్వరం డాక్యుమెంట్లన్నీ బయటపెడతా

దిల్లీ: తాను ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోకి మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి ఆ కుటుంబమే ప్రధాన శత్రువని మండిపడ్డారు. దిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణ, శాఖల కేటాయింపుపై దిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని సీఎం చెప్పారు. హైదరాబాద్ వచ్చాక అందరితో సంప్రదించి శాఖలు



నిర్ణయిస్తామని తెలిపారు. కర్ణాటక కులగణనపై మాత్రమే అధిష్ఠానం వద్ద చర్చలు జరిగాయన్నారు. కాళేశ్వరంపై రెండు రోజుల్లో మీడియా సమావేశం నిర్వహిస్తానని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం డాక్యుమెంట్లు అన్నింటినీ బయటపెడతానన్నారు. తెలంగాణకు సంబంధించి కేంద్రంలో అన్నింటికీ అడ్డుపడుతోంది కిషన్‌రెడ్డేనని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకూ ఆయన నిధులు సాధించలేదని విమర్శించారు.

## మోదీ ఇచ్చిన హామీల పరిష్కారానికి డేట్ చెప్పాలి

హైదరాబాద్: ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలంటూ శాంతిచర్చల కమిటీ హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించింది. కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... దేశంలో పేదరికాన్ని తొలగిస్తే వామపక్ష ఉగ్రవాదం ఉండదన్నారు. ''మావోయిస్టులను 2026 మార్చి 31 నాటికి అంతం చేస్తామని ప్రకటిస్తున్నారు. నరేంద్రమోదీ ఇచ్చిన హామీల పరిష్కారానికి డేట్ చెప్పాలి. శాంతి చర్చల కమిటీ 17న చేపట్టే మహాధర్నాను పార్టీలకు అతీతంగా విజయవంతం చేయాలి'' అని కోరారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, చెరుకు సుధాకర్, వామపక్ష పార్టీల నేతలు సమావేశంలో పాల్గొన్నారు.



# కృష్ణమ్మ తీరాన పడవలపై యోగాసనాలు



విజయవాడ: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విజయవాడ హరిత బెరం పార్కు వద్ద పడవలపై యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కృష్ణా నది తీరాన పడవలపై అధికారులు, నగరవాసులు యోగాసనాలు వేసి ప్రపంచ రికార్డును నెలకొల్పారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. ఆ చిత్రాలు.




























## రూ.3వేలు దాటిన యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు?



**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే జరుగుతున్నాయి. చిన్న మొత్తం నుంచి పెద్ద మొత్తంలో యూపీఐ ద్వారానే లావాదేవీలు జరుపుతున్నారు. గూగుల్‌పే, ఫోన్ పే, పేటీఎం తదితర యాప్స్ సహాయంతో డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నారు. టీ దుకాణంలో రూ.10 పెట్టి ఛాయ్ తాగినా సరే యూపీఐ చేసేస్తున్నారు. ప్రస్తుతం భారతదేశంలో ప్రభుత్వం యూపీఐ డిజిటల్ చెల్లింపులను పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. అయితే, త్వరలోనే యూపీఐ లావాదేవీలపై మర్చెంట్ ఛార్జీలను విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం.

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేటును తిరిగి ప్రవేశపెట్టే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మర్చంట్ టర్నోవర్ కంటే ట్రాన్సాక్షన్ విలువ ఆధారంగానే ఛార్జీలను వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. రూ.3 వేల కంటే ఎక్కువ ఉన్న అన్ని యూపీఐ చెల్లింపులపై ఈ ఛార్జీలను విధించే అవకాశం ఉందని తెలుస్తోంది. చిన్న మొత్తాలపై మాత్రం ఎలాంటి ఫీజులు ఉండవని సమాచారం. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రధానమంత్రి కార్యాలయం, ఆర్థిక వ్యవహారాల శాఖ, ఆర్థిక సేవల విభాగం ఉన్నతాధికారుల మధ్య చర్చల దశలో ఉన్నట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది.

దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు యూపీఐ, రూపే లావాదేవీలపై అన్ని రకాల ఎండీఆర్ ఛార్జీలను ప్రభుత్వం 2022లో రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఛార్జీలను తిరిగి తీసుకురావడం వల్ల యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండబోదని తెలుస్తోంది. ఎందుకంటే ఈ లావేదేవీల కోసం యూజర్ల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరు. కాకపోతే దీనివల్ల వ్యాపారులు మళ్లీ నగదు చలామణికి మొగ్గు చూపే అవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### రికార్డుస్థాయికి యూపీఐ లావాదేవీలు

యూపీఐ.. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దీనిని అభివృద్ధి చేసింది. డిజిటల్ పేమెంట్స్‌లో యూపీఐ సరికొత్త విప్లవం సృష్టించిందని చెప్పొచ్చు. ఇక ఈ ఏడాది యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మే నెలలో రూ.25.14 లక్షల కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఎన్‌పీసీఐ వెల్లడించింది. అంతక్రితం నెలలో జరిగిన రూ.23.94 లక్షల కోట్ల లావాదేవీలతో పోలిస్తే ఐదు శాతం అధికమయ్యాయని తెలిపింది. సంఖ్యపరంగా చూస్తే 1,867.7 కోట్ల లావాదేవీలు జరిపారు. అలాగే ఏప్రిల్ నెలలో ఇది 1,789.3 కోట్ల లావాదేవీలు జరిగాయి. క్రితం ఏడాది ఇదే నెలలో జరిగిన రూ.20.44 లక్షల కోట్ల యూపీఐ లావాదేవీలతో పోలిస్తే మాత్రం 23 శాతం వార్షిక వృద్ధి నమోదైందని పేర్కొంది.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధర, పెరిగిన వెండి ధర..



**న్యూఢిల్లీ:** భారతీయులకు బంగారం కొనడం అంటే అమితమైన ఇష్టం. దీంతో ఎటువంటి సందర్భం వచ్చినా సరే శక్తి కొలది బంగారం లేదా వెండి కొనుగోలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తారు. అంతగా బంగారం, వెండి లోహాలు మన జీవితాలతో ముడిపడి పోయాయి. బంగారం నగలు అలంకారానికి మాత్రమేకాదు.. ఆర్థిక భరోసాగా కూడా భావిస్తారు. గత కొంత కాలంగా పసిడిని మంచి పెట్టుబడిగా కూడా భావిస్తున్నారు. దీంతో పసిడి, వెండి లోహాలకు భారీ డిమాండ్ నెలకొంది.

ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన పరిమాణాలతో బంగారం ధరల్లో రోజు రోజుకీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో పసిడి ప్రియులకు కొనుగోలు చేసే విషయంలో కొంచెం గందరగోళం నెలకొంది. అయితే వాస్తవానికి పసిడి, వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్ లో డాలర్ మారకంపై ఆధారపడి ఉంటాయి. అంతేకాదు ద్రవ్యోల్బణం, కేంద్ర బ్యాంకు బంగారు నిల్వ, వడ్డీ రేట్లపై కూడా ఆధారపడి ఉంటాయి.

హైదరాబాద్‌లో పసిడి ధర మంగళవారం వలెనే బుధవారం కూడా స్వల్పంగా తగ్గింది. ఈ రోజు 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 89,440ఉండగా.. 24 క్యారెట్ల10 గ్రాముల బంగారం ధర రూ. 97,570లకు దిగి వచ్చింది. దాదాపు ఇవే ధరలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రధాన నగరాలైన విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, పొద్దుటూరు, వరంగల్ లో కొనసాగుతున్నాయి.

### జూన్ 11 వ తేదీ బుధవారం వెండి ధర

ప్రాచీన కాలం నుంచి వెండి విలువైన లోహంగా ప్రసిద్ధిచెందినది. వెండిని ఆభరణాలు, నాణేలు, వంటపాత్రల తయారీ కోసం మాత్రమే కాదు రసాయనిక చర్యలలో ఉత్ప్రేరకంగా కూడా ఉపయోగిస్తున్నారు. అదే సమయంలో వెండి మంచి పెట్టుబడిగా కూడా భావిస్తున్నారు. అందుకనే బంగారం తర్వాత వెండి లోహం కొనుగోలుకి ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ నేపథ్యంలో వెండి కొనాలనుకునే వినియోగదారులు మార్కెట్ లో ధరలు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకోవాలని భావిస్తున్నారు.

బంగారం క్రమంగా దిగి వస్తుండగా వెండి ధర మాత్రం షాక్ ఇస్తూ పై పైకి చేరుకుంటుంది. ఈ రోజు హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లో కేజీ వెండి ధర స్వల్పంగా అంటే వంద రూపాయలు మేర పెరిగింది. దీంతో బుధవారం కేజీ వెండి ధర రూ. 1,19,100లకు చేరుకుంది.

## త్వరలో భారత్‌లో ప్రారంభం కానున్న స్టార్‌లింక్ సేవలు..




**న్యూఢిల్లీ:** ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ కంపెనీ శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ స్టార్‌లింగ్ సేవలు త్వరలో భారత్‌లో ప్రారంభం కానున్నాయి. భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ విభాగం నుంచి జీఎంపీసీఎస్ (గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్ శాటిలైట్) లైసెన్స్ పొందిన కంపెనీ.. ప్రస్తుతం భారత్‌లో సార్‌లింక్ సేవలను ప్రారంభించేందుకు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయి. అయితే, స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ ధర, ప్రరణాళిక సంబంధించి ఓ కీలక నివేదిక వెలుగులోకి వచ్చింది. ఈ నివేదిక ప్రకారం స్టార్ లింక్ ప్రైమరీ సెటప్ కిట్ భారత్‌లో రూ.33వేలకు అందుబాటులో ఉండనున్నది. ఇందులో స్టార్‌లింక్ డిష్, కిక్‌స్టాండ్, జెన్ 3 రౌటర్, స్టార్‌లింక్ కేబుల్, ఏసీ కేబుల్, విద్యుత్ సరఫరా కేబుల్స్ ఉండనున్నట్లు తెలుస్తున్నది.

## మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో స్మృతి మంధాన



న్యూఢిల్లీ: తాజా ఐసిసి మహిళల వన్డే ర్యాంకింగ్స్ విడుదలలో భారత్‌కు చెందిన స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన స్థానం నిలుపుకోవడంలో విజయవంతమైంది. ఆమె ఇప్పటికీ రెండో స్థానంలో కొనసాగుతోంది. ఇదే సమయంలో, ఇంగ్లాండ్‌కు చెందిన వికెట్ కీపర్-బ్యాటర్ అమీ జోన్స్ అత్యుత్తమ ఫామ్‌లో ఉండటంతో తన ర్యాంకింగ్స్‌ను క్షణాల్లో మార్చేసింది. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అద్భుత సెంచరీలతో మెరిసిన జోన్స్, మహిళల బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి ఏడవ స్థానానికి చేరుకుంది. అయితే ఇది తాత్కాలికం కాకుండా, రెండవ వన్డేలో 98 బంతుల్లో 129 పరుగులు చేసిన ఆమె, తన స్థిరతతో ప్రస్తుతం నాలుగో స్థానానికి చేరి 689 రేటింగ్ పాయింట్లను సొంతం చేసుకుంది. ఈ స్థాయికి చేరుకోవడం ద్వారా జోన్స్, లారా వోల్వార్డ్, స్మృతి మంధాన, నాట్ స్కైవర్-బ్రంట్‌లుగా పేరొందిన అగ్ర శ్రేణి త్రయానికి సమీప పోటీదారిగా నిలిచింది.ఇంగ్లాండ్ జట్టు వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను అజేయంగా ముగించడంలో అమీ జోన్స్ కీలక పాత్ర పోషించింది. అదే జోష్‌ను టీ20 సిరీస్‌కి కూడా తీసుకెళ్లి, ఆ సిరీస్‌ను 3-0 తేడాతో గెలుచుకోవడంలో వారు సమర్థత చూపారు. జోన్స్ ఫామ్‌తో పాటు బౌలింగ్ విభాగంలో కేట్ క్రాస్ కూడా అదరగొట్టింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆమె మొత్తం మూడు వికెట్లు తీసింది. ముఖ్యంగా చివరి వన్డేలో 1/15తో అద్భుత ఆర్థికంగా బౌలింగ్ చేసి టీమ్ విజయంలో తనవంతు పాత్ర పోషించింది. ఈ ప్రదర్శన వల్ల ఆమె మహిళల బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఎనిమిదో స్థానానికి చేరుకుంది.ఇప్పుడు రాబోయే భారత పర్యటన నేపథ్యంలో, అమీ జోన్స్, కేట్ క్రాస్‌లు తమ మెరుగైన ప్రదర్శనలతో ర్యాంకింగ్స్‌లో మరింత ఎత్తుకు చేరే అవకాశాలు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తంగా, ప్రస్తుతం మహిళల వన్డే క్రికెట్‌లో ర్యాంకింగ్స్ పోటీ అత్యంత ఉత్కంఠభరితంగా మారింది. లారా వోల్వార్డ్, మంధాన, నాట్ స్కైవర్‌లు టాప్‌లో కొనసాగుతుండగా, అమీ జోన్స్ తమ దూకుడు ప్రదర్శనతో అదే స్థాయికి చేరేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

## శ్రేయస్‌ను జట్టులో చేర్చకపోవడంపై సెలెక్టర్లపై గంగూలీ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ:** శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో టీమిండియా ఇంగ్లాండ్‌తో 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం సన్నాహాలు చేస్తోంది. యువ ఆటగాళ్లతో నిండిన ఈ జట్టుకు ఇంగ్లాండ్‌లో గెలవడం కష్టమే కానీ అసాధ్యం కాదు. ఇటువంటి సమయంలో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులో చేర్చకపోవడంపై సెలెక్టర్లపై తీవ్ర విమర్శలు గుప్పించారు.జూన్ 20 నుంచి భారత జట్టు తొలి టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. దీని కోసం జూన్ 7 నుంచి ఆటగాళ్లు ఇంగ్లాండ్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. జస్‌ప్రీత్ బుమ్రా, రిషబ్ పంత్, కరుణ్ నాయర్ వంటి ఆటగాళ్ల అనుభవం ఈ పర్యటనలో తప్పకుండా ఉపయోగపడుతుంది. అయితే చాలా మంది యువ ఆటగాళ్లకు ఇంగ్లాండ్ పరిస్థితులు సవాలుగా మారనున్నాయి. ఓ ఇంటర్వ్యూలో సౌరవ్ గంగూలీ మాట్లాడుతూ.. “ ఆస్ట్రేలియాలో మన యువ జట్టు అద్భుతంగా రాణించింది. అప్పుడు రోహిత్-విరాట్ లేరు. శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, అభిమన్యు, యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్ తిరిగి వచ్చారు. నా దృష్టిలో ఇది వీరందరికీ ఒక అవకాశం.. ఎటువంటి ఒత్తిడి లేదు. ఈ పరిస్థితులు మీకు సవాలు విసురుతాయి కానీ మిమ్మల్ని తీర్చిదిద్దుతాయి కూడా.”అని అన్నారు.ఈ ఇంటర్వ్యూలో సౌరవ్ గంగూలీ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులో చేర్చకపోవడంపై సెలెక్టర్లపై సౌరవ్ గంగూలీ విమర్శలు గుప్పించారు. సౌరవ్ గంగూలీ మాట్లాడుతూ.. “ శ్రేయస్ అయ్యర్ ఒక సంవత్సరంగా తన అత్యుత్తమ ప్రదర్శన ఇస్తున్నాడు. శ్రేయస్ అయ్యర్ జట్టులో ఉండాల్సింది. శ్రేయస్ అయ్యర్ జట్టు నుంచి బయట ఉండాల్సిన ఆటగాడు కాదు. అయ్యర్ ఇప్పుడు ఒత్తిడిలో కూడా మంచి ఇన్నింగ్స్ లు ఆడుతున్నాడు. బాధ్యతలను అర్థం చేసుకుంటున్నాడు. షార్ట్ బంతులను కూడా ఆడుతున్నాడు. టెస్ట్ క్రికెట్ భిన్నంగా ఉన్నప్పటికీ శ్రేయస్ అయ్యర్ ఈ సిరీస్‌లో చేరితే అతని సామర్థ్యాన్ని చూడాలని కోరుకుంటున్నాను.” అని గంగూలీ పేర్కొన్నారు.శ్రేయస్ అయ్యర్ టెస్ట్ కెరీర్‌ను పరిశీలిస్తే.. 14 మ్యాచ్‌లలో 24 ఇన్నింగ్స్‌లలో 36.86 సగటుతో 811 పరుగులు చేశాడు. అందులో ఒక సెంచరీ, 5 అర్థ సెంచరీలు ఉన్నాయి.

## ప్రాక్టీస్ సెషన్‌లో స్టేడియం పైకప్పునే బద్దలు కొట్టేశాడు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్ 2025)లో సూపర్ ఫ్లాప్ అయిన తర్వాత, భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఇప్పుడు ఫామ్‌లోకి తిరిగి వస్తున్నట్లు కనిపిస్తోంది. జూన్ 20న ప్రారంభమయ్యే టెస్ట్ సిరీస్‌కు ముందు భారత సీనియర్ జట్టు ఇంగ్లాండ్‌లో ప్రాక్టీస్ చేస్తోంది. ఈ సమయంలో, పంత్ సిక్స్ కొట్టడంతో స్టేడియం పైకప్పు దెబ్బతింది. ఈఎస్‌పీఎన్ క్రిక్ ఇన్ఫో ఖాతా నుండి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియోలో, వాషింగ్టన్ సుందర్ బంతిని నెట్స్‌లో రిషబ్ పంత్ భారీ షాట్ ఆడగా.. అది కాస్తా స్టేడియం పైకప్పును తాకింది. దాంతో స్టేడియం పైకప్పు విరిగిపోయినట్లు చూడవచ్చు.

ఐపీఎల్ 2025లో లక్నో సూపర్‌జెయింట్స్ రికార్డు స్థాయిలో రూ. 27 కోట్లకు కొనుగోలు చేసిన తర్వాత, పంత్ సీజన్ అంతా ఫామ్‌లో లేడు, చివరికి ఎటువంటి ప్రాముఖ్యత లేని మ్యాచ్‌లో సెంచరీ చేశాడు. అతని జట్టు ఆ మ్యాచ్‌లో కూడా ఓడిపోయింది. అయినప్పటికీ, %దీజజ×% అతనికి భారత టెస్ట్ జట్టు వైస్ కెప్టెన్‌గా పదోన్నతి కల్పించింది. భారత క్రికెట్ జట్టు ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో ఒక వీడియో పోస్ట్ చేయబడింది. దీనిలో కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, రిషబ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజాతో సహా చాలా మంది ఆటగాళ్ళు యాక్షన్‌లో కనిపిస్తున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సహా కోచింగ్ సిబ్బంది కూడా ఆటగాళ్లతో మాట్లాడుతూ నెట్స్‌లో చెమటలు పడుతూ వారికి మార్గనిర్దేశం చేస్తున్నారు. గిల్, పంత్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా, సిరాజ్ మరియు బుమ్రా బౌలింగ్ చేస్తున్నారు. ఫీల్డింగ్ కోచ్ టి దిలీప్ నాయకత్వంలో జట్టు ఫీల్డింగ్ కూడా ప్రాక్టీస్ చేసింది. ఒక వీడియో ప్రకారం, ఈ ప్రాక్టీస్ సెషన్‌లో ప్రధాన భాగం బుమ్రా మరియు కెప్టెన్ గిల్ మధ్య జరిగిన ముఖాముఖి పోరాటం. గిల్ బుమ్రా బంతులను వదిలేయడం లేదా ఇబ్బంది పడటం కనిపించింది.

## ఓపెనింగ్ కోసం రేసులో ముగ్గురు ప్లేయర్లు!



**న్యూఢిల్లీ:** భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జూన్ 20న ఆరంభం కానుంది. ఆగస్టు 4 వరకు కొనసాగుతుంది. ఈ పర్యటన కోసం భారత జట్టు ఇంగ్లాండ్‌కు చేరుకుంది. గతంలో, ఇండియా ఎ జట్టు ఇంగ్లాండ్ లయన్స్‌తో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతున్నప్పుడు, టీమ్ ఇండియా కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ బ్యాట్ బలహీనంగా ఉన్నట్లు కనిపించింది. కాబట్టి, ఇప్పుడు కెఎల్ రాహుల్ స్థానం కూడా ప్రమాదంలో ఉందని చెప్పడం తప్పు కాదు.

గత మ్యాచ్‌లో అభిమన్యు బ్యాట్ నిశ్శబ్దంగా ఉంది, కానీ రెండవ మ్యాచ్‌లో, జట్టు కెప్టెన్ అర్థ సెంచరీ చేసి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అభిమన్యు ఈశ్వరన్‌ను ఇండియా ఎ జట్టు కెప్టెన్‌గా నియమించారు. రెండవ టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో, అభిమన్యు 13 బంతుల్లో 11 పరుగులకే ఔటయ్యాడు. రెండవ ఇన్నింగ్స్‌లో, కెప్టెన్ బ్యాట్ నుండి పరుగులు వచ్చాయి. రెండో ఇన్నింగ్స్‌లో అభిమన్యు ఈశ్వరన్ 92 బంతుల్లో 80 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత జట్టు బలమైన స్థితిలో ఉంది. అతను కొన్ని పరుగుల తేడాతో తన సెంచరీని కోల్పోయాడు. కానీ అతని అద్భుతమైన ప్రదర్శన టీం ఇండియా ప్లేయింగ్ ఎలెవన్‌లో పెద్ద తేడాను కలిగిస్తుంది.నంబర్ వన్ స్థానంలో బ్యాటింగ్ చేసిన అభిమన్యు, కెఎల్ రాహుల్‌తో కలిసి రెండో వికెట్‌కు 88 పరుగులు జోడించాడు. అభిమన్యుకు గతంలో భారత టెస్ట్ జట్టులో అవకాశం లభించింది. కానీ అతనికి చివరి 11 మందిలో అవకాశం రాలేదు. అయితే, రోహిత్ రిటైర్మెంట్ తర్వాత, ఈసారి అభిమన్యు టెస్ట్ క్రికెట్‌లోకి అరంగేట్రం చేయడం ఖాయంగా కనిపిస్తోంది. అభిమన్యు 102 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌ల్లో 7750 పరుగులు చేశాడు. ఈ కాలంలో, అతను 27 సెంచరీలు సాధించగా, 30 హాఫ్ సెంచరీలు కూడా అతని బ్యాట్ నుండి వచ్చాయి. భారత ఎ జట్టు ప్రాక్టీస్ మ్యాచ్‌లో కరుణ్ నాయర్ అద్భుతంగా రాణించాడు. డబుల్ సెంచరీ సాధించాడు. అంతకుముందు, కరుణ్ ఐపిఎల్, దేశీయ క్రికెట్‌లో కూడా చారిత్రాత్మక పని చేశాడు. కాబట్టి, కరుణ్ నాయర్ ఓపెనర్‌గా ఎంపిక కావచ్చు. మరోవైపు, కెఎల్ రాహుల్ కూడా సెంచరీ చేసి రోజును కాపాడుకున్నాడు. కాబట్టి ఇప్పుడు ఈశ్వరన్‌కు అవకాశం లభిస్తుందో లేదో చూడాలి. యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. అయితే మరో ఓపెనింగ్ స్లాట్ కోసం ప్రస్తుతం తీవ్రమైన పోటీ నెలకొని ఉంది. రేసులో కేఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్ లు ఉన్నారు.

టీమిండియా : శుబ్‌మాన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్/వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), అభిమన్యు ఈశ్వరన్, మహ్మద్ జయస్వర్, మహ్మద్ జయస్వర్, బి.ఎస్. ప్రసిద్ కృష్ణ, కరుణ్ నాయర్, వాషింగ్టన్ సుందర్, ఆకాష్ దీప్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్.

# బన్నీ కథతో..ఎన్టీఆర్ సినిమా

## రూట్ మార్చిన దర్శకుడు త్రివిక్రమ్




**టాకీస్:** ప్రస్తుతం గత కొన్నిరోజులుగా త్రివిక్రమ్ తరువాతి ప్రాజెక్ట్స్ గురించే చర్చ నడుస్తోంది. పుష్ప 2 తరువాత అల్లు అర్జున్,. త్రివిక్రమ్‌తో ఒక సినిమా చేయాల్సి ఉంది. డైనమిక్ ద్యూ అనే పేరుతో బన్నీ - త్రివిక్రమ్ సినిమాను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు కూడా. ఇక పుష్ప 2 తరువాత.. బన్నీ, అట్లీ సినిమాను ఓకే చేయడంతో పాటు పట్టాలు కూడా ఎక్కించేశాడు. అట్లీ-సినిమా అవ్వడానికి దాదాపు ఏడాది పడుతుంది. ఈలోపు గురూజీ.. ఎప్పటినుంచో వెంకటేష్ తో ఒక సినిమా చేయాలనుకుంటున్న విషయం తెల్సిందే. ఇప్పుడు ఆ సినిమాను పట్టాలెక్కించి పనిలో ఉన్నాడు. ఇక ఇది కాకుండా రామ్ చరణ్ తో కూడా మరో సినిమాను ప్లాన్ చేస్తున్నాడు. ఇప్పటికే చరణ్ కు కథ వినిపించడం, ఆయన ఓకే చెప్పడం కూడా జరిగిందట. అయితే చరణ్ తో సినిమా అనేసరికి.. అది బన్నీకి వినిపించిన కథనే అని టాక్ నడిచింది. అందుతున్న సమాచారం ప్రకారం.. చరణ్ కు గురూజీ చెప్పిన కథ బన్నీది కాదట. అది పూర్తిగా వేరని తెలుస్తోంది. ఇక బన్నీకి చెప్పిన కథను త్రివిక్రమ్.. ఎన్టీఆర్ కు చెప్పడానికి రెడీ అయ్యినట్లు-తెలుస్తోంది. అట్లీ- సినిమా తరువాత అయినా త్రివిక్రమ్ సినిమాకు బన్నీ గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా అనే నమ్మకం లేదు. దీంతో బన్నీతో సినిమాను క్యాన్సిల్ చేసుకొని ఆ కథను ఎన్టీఆర్ తో చేయాలని చూస్తున్నాడని టాక్. మైథలాజికల్ జోనర్ కాబట్టి.. ఎన్టీఆర్ బాగా సెట్ అవుతాడని, ఈ కథకు ఎన్టీఆర్ కూడా ఓకే చెప్పేలా ఉన్నాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఎన్టీఆర్ త్రివిక్రమ్ కాంబోలో అరవింద సమేత లాంటి హిట్ పడింది. ఇప్పుడు ఈ కాంబో రిపీట్ అవుతుంది. ఈ ఏడాదిలోనే గురూజీ.. వెంకటేష్ మూవీని పట్టాలెక్కిస్తాడు. అది వచ్చే ఏడాదికి రిలీజ్ అవుతుంది. దీని తరువాత చరణ్ మూవీ. ఒకవేళ చరణ్ కనుక బిజీగా ఉంటే.. ఎన్టీఆర్ మూవీని సెట్స్ మీదకు తీసుకెళ్లనున్నాడట త్రివిక్రమ్. ఇంకోపక్క ఎన్టీఆర్ .. వార్ 2 ను ముగించి ప్రశాంత్ నీల్ సినిమాతో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా కూడా వచ్చే ఏడాదిలోపు పూర్తి అవుతుంది. ఎన్టీఆర్ కనుక గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. వచ్చే ఏడాదిలోనే ఈ సినిమా పట్టాలెక్కేస్తోంది. మరి ఎన్టీఆర్-త్రివిక్రమ్ కాంబో రిపీట్ అవుతుందో లేదో చూడాలి.

# రిలీజ్‌కు రెడీ అయిన నిశ్శబ్ద

**టాకీస్:** మనోజ్ కుమార్, ఆశిత రెడ్డి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా నిశ్శబ్ద చిత్రాన్ని శ్రీరిషి సాయి ప్రొడక్షన్ బ్యానర్‌పై శ్రీనివాస్, ఎం.సంధ్యారాణి నిర్మిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రమణమూర్తి తంగెళ్లపల్లి రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న నిశ్శబ్ద సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మంగళవారం నిర్మాత శ్రీనివాస్



పుట్టినరోజు సందర్భంగా చిత్ర టీజర్ ను హైదరాబాద్‌లో ఘనం గా రిలీజ్ చేశారు. అనంతరం చిత్రబృందం కేక్ కట్ చేసి నిర్మాత శ్రీనివాస్ బర్త్ డే సెలబ్రేషన్స్ జరిపారు. ఈ కార్యక్రమంలో యువ హీరోలు కృష్ణ, సంజయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత శ్రీనివాస్ మాట్లాడుతూ 'నిశ్శబ్ద టీజర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నా.సినిమా కూడా అంతే బాగుంటు-ంది. త్వరలోనే మా మూవీని థియేటర్స్ లోకి తీసుకొస్తాం. ఇంకా నాలుగైదు ఆసక్తికరమైన మూవీస్ మా ప్రొడక్షన్ నుంచి రాబోతున్నాయి. ప్రస్తుతం ఆ చిత్రాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి'అని అన్నారు. డైరెక్టర్ రమణమూర్తి తంగెళ్లపల్లి (శపశశపషసశా ÷శగ్గ÷శూశె) మాట్లాడుతూ 'నిశ్శబ్ద చిత్రాన్ని హారర్‌గా థ్రిల్లర్ తెరకెక్కిస్తున్నాను. ఈ సినిమా చేసే క్రమంలో ప్రొడ్యూసర్ శ్రీనివాస్ ఎంతో సపోర్ట్ అందించారు. అందరి ఆదరణతో 'నిశ్శబ్ద' సినిమా త్వరలోనే థి యేటర్స్‌లోకి వచ్చి మంచి విజయాన్ని సాధిస్తుందని ఆశిస్తున్నా'అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ని ర్మాత ఎం. సంధ్యారాణి, హీరో మనోజ్ కుమార్, హీరోయిన్ ఆశితరెడ్డి, సూర్య, నాగలక్ష్మిపాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌లో ఏదో తెలియని

# ఆకర్షణ ఉంది

### కాస్ట్యూమ్స్ డిజైనర్ అనైతా ష్రాఫ్ అడజానియా



**టాకీస్:** జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ కలసి నటించిన 'వార్ 2' చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్‌తో అంచనాలు అమాంతం పెరిగాయి. సినిమాలో ఎన్టీఆర్ లుక్, స్టైలింగ్ గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. 'వార్ 2' చిత్రానికి అనైతా ష్రాఫ్ అడజానియా కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పని చేశారు. సినిమాలో ఆయన లుక్, ఇతర విషయాల గురించి అనైతా వివరిస్తూ 'ఎన్టీఆర్‌తో తొలిసారిగా కలసి పనిచేయడం ఆనందంగా అనిపించింది. ఆయన సెట్స్‌లోకి ఎంట్రీ- ఇస్తే ఆ ఎనర్జీ అందరిలోకి ప్రవేశిస్తుంది. ఆయనలో ఏదో తెలియని ఆకర్షణ శక్తి ఉంది. తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఆయన ఎంతో ఉల్లాసంగా ఉంచుతారు. 'వార్ 2'లో ఆయన పోషిస్తున్న పాత్రలో ఎన్నో రకాల లేయర్స్ ఉంటాయి. అందుకే చాలా లుక్స్ డిజైన్ చేశాం. ఆయన పాత్ర స్వభావాన్ని ప్రతిబింబించేలా కాస్ట్యూమ్స్ డిజైన్ చేశాం. ఓ లక్ష్యంతో పని చేసే మానవ యంత్రంలా ఆయన్ని చూపించే ప్రయత్నం చేశాం' అన్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా 'వార్ 2' చిత్రాన్ని నిర్మించారు.



# తడిసిన అందాలతో హీటు పెంచేసిన 'శాలినీ పాండే'

**టాకీస్:** 'అర్జున్ రెడ్డి' మూవీతో సౌత్ లో అలజడి రేపింది అందాల బ్యూటీ శాలినీ పాండే. ఆ మూవీ అంత పెద్ద హిట్ అయిందంటే శాలినీ ఒక రీజన్. కానీ ఏం లాభం.. దాని తర్వాత ఆ స్థాయిలో అవకాశాలు అయితే రాలేదు. కల్యాణ్ రామ్ తో ఓ మూవీ చేసింది. కానీ అది బెడిసికొట్టింది. దీంతో చేసేది లేక బాలీవుడ్ బాట పట్టేసింది. బాలీవుడ్ వెళ్లాక సన్నగా నాజూగ్గా మారిపోయింది. ఘాటు అందాలను ఆరబోయడం స్టార్ట్ చేసింది. తాజాగా తడిసిన అందాలతో మరోసారి రెచ్చిపోయింది. ఈ సారి తన పలచని టీషర్టు వేసుకుని ఒళ్లంతా తడిపేసుకుని ఘాటు ఫోజులు ఇచ్చేసింది. అర్జున్ రెడ్డి తర్వాత షాలిని తెలుగులో పలు సినిమాలు చేసినప్పటికీ.. పెద్దగా ఆకట్టుకోలేక పోయాయి. దీంతో తెలుగులో నెమ్మదిగా ఫేడ్ అవుట్ అయిపోయింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం హిందీ, తమిళ్ లో అడపాదడపా సినిమాలు చేస్తోంది.

## కుబేర నుంచి

# డుండుం పాట విడుదల



**టాకీస్:** నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న కాంబినేషన్‌లో టాలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మాతలు. జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచిన మేకర్స్ ఇప్పటికే విడుదల చేసిన పాటలు, గ్లిమ్స్ టీ-జర్ మూవీపై అంచనాలను రెట్టింపు చేశాయి. ఈనేపథ్యంలో ఈ చిత్రం నుంచి పీపీ డుండుండుం అంటూ కథానాయిక రష్మికపై చిత్రీకరించిన వీడియో సాంగ్‌ను మేకర్స్ బుధవారం ఉదయం విడుదల చేశారు. చైతన్య పింగళి సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ సోదరి ఇంద్రావతి చౌహాన్ ఆలపించగా రాక్‌స్టార్ దేవీశ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చాడు. ఈ పాట వింటుంటే మరో హిట్ అవడమే గాక సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంటుందని నెటిజన్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# న్యూ ఏజ్ లవ్ స్టోరీ 'సయారా'



**టాకీస్:** యష్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్ మీద మోహిత్ సూరి తెరకెక్కిస్తున్న న్యూ ఏజ్ లవ్ స్టోరీ 'సయారా'.ఈ మూవీతో అహాన్ పాండే తెరకు పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో అనీత్ పద్దా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల రిలీజ్ చేసిన 'సయారా' టీజర్, టైటిల్ సాంగ్ అందరినీ ఆకట్టుకుంది. ఇదొక న్యూ ఏజ్ లవ్ స్టోరీ అని, నేటి ట్రెండ్‌కి, యూత్‌ని అద్దం పట్టేలా ఉందని టీజర్ చూస్తే అర్థం అవుతుంది. తాజాగా సయారా నుంచి రెండో పాటను రిలీజ్ చేశారు. 'బర్బాద్' అంటూ సాగే ఈ పాటను యంగ్ సెన్సేషన్ జుబి న్ ఆలపించారు. ఈ పాటకు ది రిష్ సాహిత్యా న్ని అందించడమే కాకుండా బాణీని సమకూర్చారు. ఇక ఈ రొమాంటిక్ లవ్ సాంగ్ కోసం జుబిన్‌ను ఎంచుకోవడానికి ప్రత్యేక కారణం ఉందని దర్శకుడు మోహిత్ తెలిపారు. ఈ మేరకు మోహిత్ మాట్లాడుతూ.. 'ప్రేమ పాట ల్ని పాడేందుకు ప్రతీ తరంలో ఓ గాయకుడు పుట్టు-కొస్తారు. ఈ తరానికి జుబిన్ అలాంటి ఓ గ్రేట్ సింగర్. సయారా ఆల్బమ్‌లో జుబిన్ ఒక ఫీల్ గుడ్ రొమాంటిక్ ట్రాక్ పాడాలని నేను అనుకున్నాను. నేను బర్బాద్ ట్యూన్ విన్నప్పుడు జుబిన్ గాత్రం సరిగ్గా సరిపోతుందని భావించాను. ఆయన గొంతులో ఇలాంటి రొమాంటిక్ లవ్ సాంగ్స్ ఇంకా ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయి. సయారా -టైటిల్ ట్రాక్‌కి మాకు లభించిన అద్భుతమైన స్పందన తర్వాత మళ్లీ ఇలా 'బర్బాద్'ను తీసుకు వస్తున్నాం. ఈ పాటకి కూడా ఆడియెన్స్ నుంచి మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నాము'అని అన్నారు. ఈ మూవీని జూలై 18న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు.

# లేడీ డాన్‌గా అనుష్క

**టాకీస్:** కార్తీ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రాబోయే 'ఖైదీ 2' పట్టాలెక్కడానికి ఇంకొన్ని నెలలు  సమయం పడుతుంది. ఖైదీ, విక్రమ్, లియో చిత్రాలకు ముడి పెడుతూ ఖైదీ 2 ఉంటుందట. దీనిలో భాగంగా సినిమాలో చాలా పాత్రలు అదనంగా ఉంటాయి. అయితే ఖైదీ 2 చిత్రంలో అందమైన లేడీ భామల్ని



కూడా రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. దీనిలో భాగంగా స్వీటీ అనుష్క ఈ చిత్రంలో లేడీ డాన్ పాత్రలో కనిపించబోతుందని కోలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే లోకేష్ సినిమాలో డోస్ పరిమితిని మించి ఉంటుంది. పాత్ర రగ్గడ్‌గా..రఫ్‌గా ఉంటుంది. ఆ విషయంలో లోకేష్ ఎక్కడా రాజీ పడడు. అందుకోసం అనుష్క అదనంగా కష్టపడాల్సి ఉంటుంది. లోకేష్ డెన్‌లోకి ప్రవేశిస్తే అనుష్క కెరీర్ కూడా కొత్త టర్నింగ్ తీసుకుంటుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025   RNI.No. APTEL/2009/29786.